


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 228 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 24 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 228 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 24 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

# వీరయ్య చౌదరి కుటుంబానికి అండగా ఉంటాం

- వీరయ్య చౌదరి భౌతిక కాయానికి నివాళులు అర్పించిన చంద్రబాబు... హంతకులకు మాస్ వార్నింగ్
- ఒంగోలులో మొన్న టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య
- నిన్న అమ్మనబ్రోలు గ్రామానికి వచ్చిన చంద్రబాబు
- వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులకు పరామర్శ



**పెన్ పవర్ డెస్క్:**ఒంగోలులో మొన్న రాత్రి హత్యకు గురైన తెలుగుదేశం పార్టీ నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చేరుకున్న సీఎం, వీరయ్య చౌదరి పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం, వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వీరయ్య చౌదరి అంత్యక్రియల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలుస్తోంది.అమ్మనబ్రోలుకు చేరుకున్న ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణ రెడ్డి, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు శాసనసభ్యులు, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు. వారు కూడా వీరయ్య చౌదరి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, వీరయ్య చౌదరిని దారుణంగా హతమార్చారని వెల్లడించారు. కరడుగట్టిన నేరస్తుల కంటే దారుణంగా హత్య చేశారని, 53 చోట్ల కత్తిపోట్లు ఉన్నాయంటే ఎలా చంపారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వారు భూమ్మీద ఉండేందుకు అనర్హులు... వారిని ఎట్టి పరిస్థితుల్లోనైనా పట్టుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఇంత ఘోరానికి పాల్పడిన వ్యక్తులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని, తద్వారా వీరయ్య చౌదరి ఆత్మకు శాంతి కలిగేలా చేస్తామని చెప్పారు. వీరయ్య చౌదరి ఎంతో సమర్థుడైన నాయకుడని, పార్టీకి ఎన్నో సేవలు అందించారని చంద్రబాబు కొనియాడారు. లోకేశ్ తో పాటు పాదయాత్రలో 100 రోజుల పాటు తిరిగాడని గుర్తు చేసుకున్నారు. ఎవరికి కష్టం వచ్చినా ఆదుకునే వ్యక్తి... పిలిస్తే పలికే నేత వీరయ్య... ఇలాంటి వ్యక్తిని చంపేశారని, నిందితులను వదిలిపెట్టే ప్రశ్నే లేదని పునరుద్ఘాటించారు. నిందితులు ఎంత తెలివైనవాళ్లు అయినా ఎక్కడో ఒక చోట క్లూస్ వదిలిపెడతారని, వారు ఎక్కడున్నా గాలించి పట్టుకుంటామని అన్నారు. హంతకుల కోసం 12 బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. ఈ మండలంలో టీడీపీకి 10 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందంటే వీరయ్య చౌదరి సత్తా ఏంటో అర్థమవుతుందని అన్నారు. ఇటువంటి మంచి నాయకుడ్ని కోల్పోవడం బాధ కలుగుతుందని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉండి కూడా ఇలాంటి ఘోరాలు జరుగుతుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి హత్యా రాజకీయాలు చేసే వ్యక్తులకు ఒకటే హెచ్చరిక... మీరు కూడా కాలగర్భంలో కలిసిపోతారు జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు.
కార్యకర్తలు భయపడ్డొద్దని, ఓ కుటుంబ పెద్దగా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నేర రాజకీయాలు చేసే పరిస్థితి కనిపిస్తోందని, అలాంటి వారిని అందరినీ తుదముట్టించే వరకు ఈ పోరాటం ఆగదని చంద్రబాబు స్పష్టం చేశారు.

## పహల్గాం దాడికి త్వరలోనే గట్టి జవాబు ఇస్తాం

- ఉగ్రవాదులకు రక్షణ మంత్రి గట్టి జవాబు
- దాడికి పాల్పడిన వారికి, వెనకుండి నడిపించిన వారికీ గట్టి సమాధానం ఇస్తామని వ్యాఖ్య
- ఉగ్రవాదాన్ని భారత్ ఏమాత్రం ఉపేక్షించదని స్పష్టీకరణ




**పెన్ పవర్ డెస్క్:**జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులు, పౌరులే లక్ష్యంగా జరిగిన అత్యంత హేయమైన ఉగ్రదాడిపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో, దాడికి పాల్పడిన ఉగ్రవాదులను, వారి వెనకుండి నడిపించిన సూత్రధారులను విడిచిపెట్టబోమని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఉగ్రవాదం పట్ల భారత్ ఏమాత్రం సహించబోదని ఆయన స్పష్టం చేశారు.దాడి ఘటన అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాధిపతులు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌తో సమావేశమయ్యారు.

వివరాలు 2లో..

## కదిరి మున్సిపాలిటీలో వైసీపీకి షాక్.. నెగ్గిన అవిశ్వాసం!



- శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం సఫలం
- ఛైర్‌పర్సన్ నజీమున్నీసా, వైస్ ఛైర్మన్లపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం
- మొత్తం 36 మందికిగానూ 25 మంది కౌన్సిలర్లు తీర్మానానికి అనుకూలంగా ఓటు
- అవిశ్వాస సమావేశానికి వైసీపీ కౌన్సిలర్లు గైర్హాజరు
- కదిరి మున్సిపాలిటీ కూటమి వశం కావడంతో టీడీపీ సంబరాలు

**పెన్ పవర్ డెస్క్:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నీసాతో పాటు వైస్ ఛైర్మన్లు గంగాదేవి, రాజశేఖర్ రెడ్డిలపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఈ పరిణామంతో కదిరి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ఖాతాలోకి చేరింది. కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా, అవిశ్వాస తీర్మానంపై జరిగిన ఓటింగ్‌కు 25 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. హాజరైన సభ్యులందరూ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. కాగా, అధికార వైసీపీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఎమ్మెల్యే కందికుంట

వివరాలు 2లో..

## ప్రధాని మోదీ నివాసంలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం..

- జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి
- అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- మోదీ నివాసంలో కీలక సమావేశం
- భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ



**పెన్ పవర్ డెస్క్:**జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి ఘటన తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో, దేశ రాజధాని న్యూఢిల్లీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశమైంది.

వివరాలు 2లో..

## ఖరీఫ్‌కు ఉత్తరాంధ్రకు నీరు అందించడమే లక్ష్యం

- ఉత్తరాంధ్రకు ఖరీఫ్ నాటికి గోదావరి జలాలు అందించడమే లక్ష్యమని నిమ్మల వెల్లడి
- పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు 8 ప్యాకేజీలుగా వేగవంతం
- రూ.1200 కోట్లతో పనులు... జూన్ కల్లా పూర్తి చేసేందుకు ప్రయత్నాలు

వివరాలు 2లో..



## మహిళకు టోకరా వేసిన కేసులో అఘోరీకి రిమాండ్

- పూజల పేరుతో మహిళ నుంచి రూ.10 లక్షలు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- అఘోరీని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

**పెన్ పవర్ డెస్క్:** ప్రత్యేక పూజల పేరుతో ఓ మహిళ నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి మోసగించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అఘోరీకి చేవెళ్ల కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు అఘోరీని అదుపులోకి తీసుకుని, అనంతరం కోర్టు ముందు హాజరుపరిచారు. వివరాల్లోకి వెళితే, ఓ మహిళ తన సమస్యల పరిష్కారం కోసం

వివరాలు 2లో..



## దివ్యాంగుడైన ట్రైనర్ తో నేలపై కూర్చొని మాట్లాడిన మంత్రి నాదెండ్ల మనోహర్

- ఏలూరు జిల్లా బుట్టాయిగూడెంలో మంత్రి నాదెండ్ల పర్యటన
- గిరిజన వెదురు హస్తకళల శిక్షణ, తయారీ, ప్రదర్శన కేంద్రం ప్రారంభం
- స్థానికులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్న మంత్రి నాదెండ్ల



**పెన్ పవర్ డెస్క్:**ఏజెన్సీ ప్రాంత గిరిజనుల నైపుణ్యానికి, ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తూ ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం పులి రాముడు గూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన గిరిజన వెదురు హస్తకళల శిక్షణ, తయారీ, ప్రదర్శన కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల

వివరాలు 2లో..

## టర్కీలో భూకంపం.. ఇళ్ల నుంచి పరుగు తీసిన ఇస్తాంబుల్ వాసులు

- టర్కీలో 6.2 తీవ్రతతో భూకంపం
- ప్రధాన నగరం ఇస్తాంబుల్‌లో కంపించిన భూమి
- ఇస్తాంబుల్‌కు నైరుతి దిశలో 40 కి.మీ దూరంలో భూకంప కేంద్రం
- బల్గేరియా, గ్రీస్, రొమేనియాలలో కూడా ప్రకంపనలు

**పెన్ పవర్ డెస్క్:**టర్కీలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు ఆ దేశ అత్యవసర నిర్వహణ సంస్థ (ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) వెల్లడించింది. ఈ భూకంపం కారణంగా ఇస్తాంబుల్‌లో బలమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. యూఎస్ జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం, ఇస్తాంబుల్ నగరానికి నైరుతి దిశగా సుమారు 40 కిలోమీటర్ల దూరంలో, భూమికి 10 కిలోమీటర్ల లోతున భూకంప

వివరాలు 2లో..



## పహల్గామ్ దాడి: భారత్‌కు ప్రపంచ దేశాల సంఘీభావం







- జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రపంచ నేతల తీవ్ర ఖండన
- ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, మారిషస్, న్యూజిలాండ్, సింగపూర్ అధినేతల దిగ్భ్రాంతి, సంతాపం
- భారత ప్రధాని మోదీకి ఫోన్ చేసి సంఘీభావం తెలిపిన ఆస్ట్రేలియా, మారిషస్ ప్రధానులు
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటన

వివరాలు 2లో..

## ఉగ్రవాదులు ప్రజలను మతం అడిగి హతమార్చడం దారుణం

- పహల్గామ్ ఉగ్రదాడిపై ఎంఐఎం అధినేత ఒవైసీ స్పందన
- దాడికి నిఘా వైఫల్యమే కారణమని తీవ్ర ఆరోపణ.
- కేంద్రం జవాబుదారీతనం వహించాలని డిమాండ్



**పెన్ పవర్ డెస్క్:**జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన భయానక ఉగ్రవాద దాడి ఘటనపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఈ దాడి పూర్తిగా నిఘా వైఫల్యం వల్లే జరిగిందని ఆయన ఆరోపించారు. నేడు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఒవైసీ, ఈ దుశ్చర్యకు నరేంద్ర మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పహల్గామ్ ఘటనను

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### దువ్వాడను ఆలస్యంగానైనా వదిలించుకున్నారా?

# లేకుంటే ఇది కూడా డ్రామానేనా?

వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను ఆ పార్టీ నాయకత్వం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ నాయకత్వం దువ్వాడ శ్రీనివాస్ ను సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు రావడంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అర్థమవుతుంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు దువ్వాడపై వరసగా ఫిర్యాదులు రావడంతోనే శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ప్రకటనలో తెలిపింది. అయితే ఇది ఒక నాటకంగా ప్రత్యర్థి పార్టీలు చెబుతున్నాయి. ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయం ఇప్పుడు తీసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా ఎమ్మెల్సీ పదవి నుంచి కూడా దువ్వాడను తప్పిస్తేనే జనం నమ్ముతారంటున్నారు.

**అనంత బాబు విషయంలోనూ...**

గతంలోనూ ఎమ్మెల్సీ అనంతబాబు విషయంలోనూ ఇదే జరిగిందన్న విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య ఘటనలో నాడు అనంతబాబు జైలుకు వెళ్లారు. నిందితుడిగా చేర్చిన పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. దళిత వ్యక్తిని చంపడమే కాకుండా తన కారులోనే పార్శిల్ చేసి ఇంటికి తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన వైనం అప్పట్లోనే సంచలనం కలిగించింది. అయితే అనంతబాబుపై పార్టీ పరంగా చర్యలు తీసుకున్న వైసీపీ అధినాయకత్వం ఎమ్మెల్సీ పదవి నుంచి మాత్రం వేటు వేయలేకపోయింది. అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆ పనిచేయకపోవడంతో ఆ ఘటన పార్టీ ఓటమికి ఒక కారణంగా మారిందనే చెప్పాలి.

**కొత్తగా జరిగింది కాదే...**

ఇక దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం కొత్తగా జరగట్లేదు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న తంతు ఇది. దాదాపు ఏడాది కాలం నుంచి ఈ డ్రామా నడుస్తుంది. దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి, ఇద్దరు కుమార్తెలు ఆయన ఇంటివద్ద ఆందోళనకు దిగారు. .దువ్వాడ శ్రీనివాస్ తో వాణి వివాహమయింది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే గత కొంత కాలం నుంచి ఇద్దరూ విడిపోయి ఉంటున్నారు. దువ్వాడ శ్రీనివాస్ గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అంతకు ముందు శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేశారు. ఓటమి పాలు కావడంతో ఆయనకు వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. తర్వాత 2024 ఎన్నికల్లో టెక్కలి సీటును కూడా దువ్వాడ శ్రీనివాస్ కే జగన్ కేటాయించారు. దీంతో పాటు మాధురి అనే మహిళతో బయట చక్కెర్లు కొడుతున్నారు. అయినా సరే ఇప్పటి వరకూ పార్టీ చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**ఇంతకాలం వెయిట్ చేసి...**

వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత దువ్వాడ శ్రీనివాస్ ఫ్యామిలీలో రచ్చ మొదలయింది. ఇది టెక్కలిలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రచ్చ అయింది. పార్టీకి కూడా తలనొప్పిగా మారింది. ఒక ఎమ్మెల్సీగా ఉండి భార్యకు విడాకులు ఇవ్వకుండా దువ్వాడ శ్రీనివాస్ మరో మహిళతో సహజీవనం చేస్తున్నారని ఆయన భార్య వాణి ఆరోపిస్తున్నారు. ఆమె ట్రాప్ లో పడి తమను పూర్తిగా వదిలేశారంటున్నారు. గత కొంతకాలంగా దువ్వాడ శ్రీనివాస్, మాధురి కలసి టూర్లు చేస్తున్నారు. అయినా పార్టీ పట్టించుకోలేదు. తిరుమలలోనూ ఫొటో షూట్ వివాదంగా మారింది. అయినా చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు తాజాగా ఆయనపై సస్పెన్షన్ వేట వేయడం డ్రామాగానే చూడాల్సివస్తుందని, పార్టీకి ఉత్తరాంధ్రలో జరుగుతున్న డ్యామేజీని కాపాడుకోవడానికే ఇప్పుడు సస్పెన్షన్ వేటు వేశారంటూ కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అందులో నిజం కూడా ఉంది కదా?

# కదిరి మున్సిపాలిటీలో వైసీపీకి షాక్.. నెగ్గిన అవిశ్వాసం!

- మొదటి పేజీ తరువాయి

వెంకటప్రసాద్ ఓటు అవసరం లేకుండానే కోరం ఉండటంతో తీర్మానం ఆమోదం పొందింది. గత కొంతకాలంగా ఛైర్‌పర్సన్ నజీమున్నీసాపై సొంత పార్టీ కౌన్సిలర్ల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోందని, అభివృద్ధి పనులు జరగడం లేదని, పరిపాలనలో పారదర్శకత లోపించిందని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే టీడీపీ మద్దతుతో కొందరు కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు ఇచ్చారు. తీర్మానం నెగ్గడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు మున్సిపల్ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో కదిరి మున్సిపాలిటీలో అవినీతి పెరిగిపోయిందని, పరిపాలనా సౌలభ్యం కొరవడిందని ఆరోపించారు. బడ్జెట్ సమావేశాలు కూడా సరిగా నిర్వహించలేని దుస్థితి నెలకొందన్నారు. అవిశ్వాసానికి మద్దతు తెలిపిన వైసీపీ కౌన్సిలర్లతో సహా సభ్యులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. హిందూపురం తర్వాత కదిరి మున్సిపాలిటీ కూడా కూటమి వశం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

# మహిళకు టోకరా వేసిన కేసులో అఘోరీకి రిమాండ్

- మొదటి పేజీ తరువాయి

అఘోరీని ఆశ్రయించారు. ప్రత్యేక పూజలు చేస్తే అన్ని కష్టాలు తొలగిపోతాయని నమ్మించిన అఘోరీ, సదరు మహిళ నుంచి దశలవారీగా సుమారు రూ.10 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. అయితే, ఎంతకాలమైనా తన సమస్యలు తీరకపోవడం, అఘోరీ ప్రవర్తనపై అనుమానం రావడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అఘోరీని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ప్రాథమిక ఆధారాలు, వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, అఘోరీకి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో అఘోరీని సంగారెడ్డి సబ్ జైలుకు తరలించారు.

ఈ సందర్భంగా అఘోరీ మాట్లాడుతూ, తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉందని, తాను పోలీసుల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని తెలిపింది. కాగా, అఘోరీ ఇటీవల వర్షిణి అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరినీ పోలీసులు మధ్యప్రదేశ్, యూపీ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండగా గుర్తించారు. అఘోరీని అదుపులోకి తీసుకుని నార్సింగి పీఎస్ కు తరలించారు. మరోవైపు, వర్షిణిని కౌన్సిలింగ్ సెంటర్ కు తరలించినట్టు తెలుస్తోంది.

### ఉగ్రవాదులు ప్రజలను మతం అడిగి

# హతమార్చడం దారుణం

- మొదటి పేజీ తరువాయి

ఒక 'ఊచకోత'గా అభివర్ణించిన ఒవైసీ, ఉగ్రవాదులు మతం అడిగి అమాయక ప్రజలను అత్యంత కిరాతకంగా హతమార్చారని అన్నారు. "పహల్గామ్‌లో మతం అడిగిన తర్వాత ఉగ్రవాదులు అమాయక ప్రజలను విచక్షణారహితంగా చంపారు. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటనకు నిఘా వైఫల్యమే కారణం" అని ఆయన స్పష్టం చేశారు. ఇది గతంలోని ఉరి, పుల్వామా సంఘటనల కన్నా ప్రమాదకరమైనదని, తీవ్ర విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉగ్రదాడిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని, బాధిత కుటుంబాలకు సాధ్యమైనంత త్వరగా న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. నిన్న కూడా ఒవైసీ ఈ దాడిని ఖండించారు. సైనిక దుస్తుల్లో వచ్చి అమాయక పర్యాటకులను లక్ష్యంగా చేసుకోవడం హేయమైన చర్య అని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. కాగా, మంగళవారం నాడు అనంత్‌నాగ్ జిల్లా పరిధిలోని పహల్గామ్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. 'మినీ స్విట్జర్లాండ్'గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో పర్యటిస్తున్న పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు.

### పహల్గాం దాడికి త్వరలోనే

# గట్టి జవాబు ఇస్తాం

- మొదటి పేజీ తరువాయి

అనంతరం ఆయన మాట్లాడుతూ, "ఇలాంటి చర్యలకు పాల్పడిన వారికి సమీప భవిష్యత్తులోనే గట్టి సమాధానం చెబుతాం" అని హెచ్చరించారు. "దాడి చేసిన వారిని పట్టుకోవడమే కాదు, ఈ కుట్ర వెనుక తెరచాటున దాగి ఉన్న వారిని కూడా వదిలిపెట్టం. దాడి చేసిన వారిని, వారి వెనుక ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుంటాం" అని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరులో భారత్ ఐక్యంగా ఉందని, ఉగ్రవాదం పట్ల తమది 'జీరో టాలరెన్స్' విధానమని రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. అవసరమైన, తగిన ప్రతిచర్య తీసుకుంటామని ఆయన తెలిపారు. భారత్ ఒక ప్రాచీన దేశమని, ఉగ్రవాదానికి భయపడదని అన్నారు.

# పహల్గామ్ దాడి: భారత్‌కు ప్రపంచ దేశాల సంఘీభావం

**పెన్ పవర్ డెస్క్:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన దారుణ ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఈ హేయమైన చర్యలో పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల పలు దేశాధినేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో భారత్‌కు అండగా ఉంటామని, ఉగ్రవాదంపై పోరులో సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని స్పష్టం చేశారు.

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ బుధవారం స్పందిస్తూ, పహల్గామ్‌లో జరిగినది హేయమైన ఉగ్రదాడి అని పేర్కొన్నారు. వివిధ వర్గాలకు చెందిన అనేక మంది స్త్రీ, పురుషులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాల దుఃఖాన్ని పంచుకుంటున్నామని, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్-నోయెల్ బారోట్ కూడా ఈ అమానవీయ దాడి నేపథ్యంలో భారత్‌కు తమ సంపూర్ణ సంఘీభావం ఉంటుందని స్పష్టం చేశారు.

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ నేరుగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. జమ్మూ కశ్మీర్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. అమాయక పౌరుల ప్రాణాలను బలిగొన్న ఈ అర్థరహిత హింస యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్ట్రేలియా, భారత్ మంచి మిత్రులని, ఈ క్లిష్ట సమయంలో భారత్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని అల్బనీస్ హామీ ఇచ్చారు. ఉగ్రవాదంపై పోరులో సహకారం అందిస్తామని తెలిపారు. మారిషస్ ప్రధాని నవీన్ రామ్‌గులామ్ కూడా ప్రధాని మోదీకి ఫోన్ చేసి, పహల్గామ్ దాడిని పిరికిపంద చర్యగా ఖండించారు. అమాయకుల హత్య పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ దుఃఖ సమయంలో భారత ప్రజలకు అండగా ఉంటామని, ఉగ్రవాదంపై పోరులో ఇరు దేశాలు ఐక్యంగా నిలుస్తాయని రామ్‌గులామ్ స్పష్టం చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సైతం కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇంతమంది ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికరమని, ఈ కష్ట సమయంలో న్యూజిలాండ్ ప్రజల ఆలోచనలు భారత ప్రజలతోనే ఉన్నాయని ఆయన 'ఎక్స్' లో పేర్కొన్నారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్ కూడా పహల్గామ్ దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని సింగపూర్ తీవ్రంగా ఖండిస్తుందని, ఈ సమయంలో భారత్‌కు అండగా నిలుస్తామని తెలిపారు. మంగళవారం నాడు పహల్గామ్ సమీపంలోని బైసరన్ లోయ ప్రాంతంలో పర్యాటకులపై ఈ దాడి జరిగింది. సమీపంలోని దట్టమైన అడవుల నుంచి వచ్చిన ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో పదుల సంఖ్యలో పర్యాటకులు మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో జరిగిన అత్యంత దారుణమైన దాడుల్లో ఇది ఒకటిగా భావిస్తున్నారు. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) ఈ దాడికి బాధ్యత వహించినట్లు ప్రాథమిక నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై అధికారిక ధృవీకరణ ఇంకా రావాల్సి ఉంది. ఈ దాడి నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. లోయ వ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, అదనపు బలగాలను మోహరించారు.

### ప్రధాని మోదీ నివాసంలో భద్రతా వ్యవహారాల

# కేబినెట్ కమిటీ సమావేశం..

- మొదటి పేజీ తరువాయి

లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో ఈ ఉన్నత స్థాయి సమావేశం జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ భేటీకి అధ్యక్షత వహిస్తున్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జయశంకర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. వీరితో పాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ త్రిపాఠి, ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమన్ ప్రీత్ సింగ్‌లు కూడా హాజరై తాజా భద్రతా పరిస్థితులపై చర్చిస్తున్నట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి అనంతరం జమ్మూకశ్మీర్‌లోని భద్రతా పరిస్థితులు, తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, పహల్గాం దాడికి సంబంధించి భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలు, భద్రతాపరమైన అంశాలపై కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా, ఈ సీసీఎస్ సమావేశానికి ముందే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పహల్గాం దాడికి పాల్పడిన వారిని ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేసిన విషయం గమనార్హం. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుతం జరుగుతున్న ఉన్నత స్థాయి సమావేశం అనంతరం కీలక ప్రకటన వెలువడే అవకాశం కనిపిస్తోంది.

### దివ్యాంగుడైన ట్రైనర్ తో నేలపై కూర్చొని మాట్లాడిన మంత్రి నాదెండ్ల మనోహర్

- మొదటి పేజీ తరువాయి

శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు ప్రారంభించారు. మంత్రి నాదెండ్ల స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవడమే కాకుండా, పలు అభివృద్ధి కార్యక్రమాలపై హామీ ఇచ్చారు.

**నేలపై కూర్చుని ఆప్యాయంగా పలకరింపు**

శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం, మంత్రి నాదెండ్ల మనోహర్ అక్కడి శిక్షకుడు, దివ్యాంగుడైన మారయ్యతో ప్రత్యేకంగా మాట్లాడారు. మారయ్య నేలపై కూర్చొని ఉండటాన్ని గమనించిన మంత్రి, తాను కూడా నేలపైనే కూర్చుని శిక్షణా కార్యక్రమం, కేంద్రం పనితీరు గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ, "ఈ కేంద్రంలో మూడు నెలల పాటు వెదురు హస్తకళలపై శిక్షణ ఇస్తాం. ఐటీడీఏ సహకారంతో శిక్షణకు అవసరమైన పరికరాలు అందిస్తున్నాం. ఏడాదికి నాలుగు బ్యాచ్‌లలో, ఒక్కో బ్యాచ్‌లో 200 మంది గిరిజన యువతకు శిక్షణ ఇస్తాం" అని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి యూనిట్లు స్థాపించుకునేందుకు బ్యాంకుల ద్వారా రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు రుణాలు అందించే ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. తాము తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని మారయ్య మంత్రిని కోరగా, తక్షణమే చర్యలు తీసుకుంటానని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు.

**గిరిజన ఉత్పత్తులకు జాతీయ స్థాయి గుర్తింపు**

అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో పండే పంటలకు, హస్తకళల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. "గిరిజన ప్రాంతాల్లో అపారమైన సహజ వనరులు, సారవంతమైన భూములు ఉన్నాయి. కానీ, ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర లభించక గిరిజనులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు గిరిజన సహకార సంస్థ (జిసిసి) ను బలోపేతం చేస్తాం" అని అన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు.

**స్థానిక సమస్యలపై తక్షణ స్పందన**

ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య ఉందని చెప్పగా, గురువారం నుంచే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఐటీడీఏ పీఓను మంత్రి ఆదేశించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, మే 1వ తేదీ నుంచి బస్సు సర్వీసు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రోడ్ల సమస్యను ఏడాదిలోగా పరిష్కరిస్తామని తెలిపారు. వైద్య సేవలపై ఫిర్యాదు చేయగా, ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకల్లా ఓపీ పూర్తి చేయాలని, మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

# టర్కీలో భూకంపం.. ఇళ్ల నుంచి పరుగు తీసిన ఇస్తాంబుల్ వాసులు

- మొదటి పేజీ తరువాయి

కేంద్రం కేంద్రీకృతమై ఉంది. భూకంప తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇస్తాంబుల్ వాసులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. టర్కీతో పాటు పొరుగున ఉన్న బల్గేరియా, గ్రీస్, రొమేనియా దేశాల్లోనూ ప్రకంపనలు సంభవించాయి. భూకంపం వల్ల జరిగిన ఆస్తి నష్టం లేదా ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. సహాయక బృందాలు అప్రమత్తమై పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో సంభవించిన పెను భూకంప విషాదం నుంచి టర్కీ పూర్తిగా తేరుకోలేదు. అప్పుడు 7.8 తీవ్రతతో సంభవించిన భూకంపం దేశంలో తీవ్ర విధ్వంసం సృష్టించింది. ఆ మహా విపత్తులో ఒక్క టర్కీలోనే 53,000 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. సిరియాలో కూడా సుమారు 6,000 మంది మరణించారు.

# ఖరీఫ్‌కు ఉత్తరాంధ్రకు నీరు అందించడమే లక్ష్యం

**పెన్ పవర్ డెస్క్:** పోలవరం ప్రాజెక్టు పనులు, ముఖ్యంగా ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, ఈ ఖరీఫ్ నాటికి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజనీర్-ఇన్-చీఫ్ వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తితో కలిసి తొండంగి మండలం బెండపూడి, శంఖవరం మండలం అన్నవరం వద్ద నిర్మిస్తున్న పంపా ఆక్విడెక్ట్ పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎడమ కాలువ పనులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నామని తెలిపారు.

"ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు పోలవరం ఎడమ కాలువను సందర్శించి, జూన్ 25 కల్లా మొదటి దశ పనులు పూర్తి చేసి ఉత్తరాంధ్రకు నీరిస్తామని హామీ ఇచ్చారు. ఆ మాట నిలబెట్టుకునేందుకు తక్షణమే రూ.1200 కోట్లు మంజూరు చేసి, టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించాం" అని మంత్రి వివరించారు. ఎడమ కాలువ పనులను మొత్తం 8 ప్యాకేజీలుగా విభజించి

ఏకకాలంలో పనులు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కొన్నిచోట్ల పనులు క్లిష్టంగా ఉన్నాయని, ముఖ్యంగా పంపా ఆక్విడెక్ట్ వద్ద ఇటీవల వరకు నీరు నిలిచి ఉండటం, ఇప్పుడు నీటిని తోడి లోతుగా ఫౌండేషన్ పనులు (సుమారు 100 అడుగుల లోతు) చేయాల్సి రావడం సవాలుగా ఉందని అన్నారు. పోలవరం ప్రధాన డ్యామ్ పనుల పురోగతి గురించి మాట్లాడుతూ, డయాఫ్రం వాల్ నిర్మాణం వేగంగా జరుగుతోందని, ఏప్రిల్ 20 నాటికి 200 మీటర్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఇప్పటికే రెండు కట్టర్లు పనిచేస్తుండగా, ఈ నెలాఖరుకు మూడో కట్టర్ రానుందని చెప్పారు. డిసెంబర్ 2025 నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. మొత్తం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే సాంకేతిక అంశాలు అనుకూలిస్తే 2027 జూన్ నాటికి, అంటే గోదావరి పుష్కరాల సమయానికి పూర్తి చేసే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పినట్లు మంత్రి నిమ్మల తెలిపారు.

## జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడి హేయమైన చర్య



**ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 23 :** జమ్ము కాశ్మీర్‌లో ఇటీవల జరిగిన దుర్మార్గమైన ఉగ్రదాడి హేయమైన చర్య అని దీనిని యావత్ భారత సమాజం తీవ్రంగా ఖండిస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు పేర్కొన్నారు. ఈ ఉగ్రదాడికి నిరసనగా ధర్మవరంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ దేశభద్రత కోసం, శాంతి స్థాపన కోసం ఎంతగానో పోరాడుతున్న మన పోలీసులపై ఉగ్రవాదులు దాడి చేసి, దాదాపు 20 మంది అమాయక టూరిస్టులను అత్యంత కిరాతకంగా హత్య చేసిన దుర్ఘటన దేశ ప్రజల హృదయాలను కలిచివేసిందన్నారు. ఆర్టికల్ 370 రద్దయిన తర్వాత జమ్ము కాశ్మీర్‌లో శాంతి పుష్పాలు విరుస్తున్న సమయంలో, ఈశాన్య సరిహద్దుల్లో నుంచి పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలైన లష్కరే తోయిబా, ఐఎస్ఐ, ఐసిస్ చట్టాల ఆధ్వర్యంలో ఇటువంటి దాడులు చేయబడ్డాయన్న విషయం స్పష్టమవుతోందని చెప్పారు. ఇది కేవలం ఒక సాధారణ దాడి మాత్రమే కాదని ఇది భారత దేశ భద్రత, ప్రజల మానవతా విలువలపై జరిగిన ఒక పిరికిపంద యుద్ధం అని అభివర్ణించారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

**రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్**



**తిరుపతి, పెన్ పవర్, ఏప్రిల్ 23 :** రాయలసీమకే తలమానికమైన తిరుపతి పట్టణంలో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రెండు శాతం ఉన్న స్పోర్ట్స్ కోటానూ మూడు శాతం కోటాతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా రిజర్వేషన్ తీసుకురావడం జరిగిందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్.ఎస్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్.వి.ఆర్ట్స్ కాలేజ్‌లోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ తిరుపతిలో పద్మ భూషణ్ మేజర్ ధ్యాన్ చంద్ హాకీ క్రీడాకారుడు వారి విగ్రహ విష్కరణ కార్యక్రమానికి యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, తిరుపతి శాసన సభ్యులు ఆరని శ్రీనివాసులు, టిటిడి బోర్డ్ మెంబర్ పనబాక లక్ష్మీ, శ్యాప్ చైర్మన్ రవి నాయుడు, బి.సి యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాయలసీమకే తలమానికమైన తిరుపతి పట్టణంలో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నారా లోకేష్ బాబు నాయకత్వంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సౌత్ ఇండియాలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక సౌకర్యాలు గల ఇండోర్ స్టేడియం ను ప్రారంభించడం జరిగిందని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు సిఎస్ఆర్ ఫండ్స్‌తో పేద క్రీడా కారుల కోసం శ్రీనివాస స్పోర్ట్ ఆడిటోరియం నందు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందన్నారు.

క్రీడాకారుల గౌరవం కోసం, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా..రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగింది అని అన్నారు. ఒలిపింక్స్, ఏషియన్ గేమ్స్ పాల్గొనడానికి వెళ్లే విద్యార్థులకు మంచి ప్రోత్సాహాలు ఇవ్వడం, శిక్షణ కాలంలో ఖర్చులు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. పదవ తరగతి తరువాయి 5లో..



## ప్రసూతి మరణాలు లేకుండా
## వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



**కర్నూలు, పెన్ పవర్, ఏప్రిల్ 23 :** ప్రసూతి మరణాలు సంభవించకుండా తల్లులకు సరైన సమయంలో వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రసూతి మరణాలకు సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 22 నుండి ఫిబ్రవరి 13 వరకు సంభవించిన 6 మాతృమరణాలకు సంబంధించి నివేదికలను పరిశీలిస్తూ మాతృ మరణాలు ఎలా జరిగాయి, వాటి కారణాలు ఏంటి అని కలెక్టర్ సంబంధిత వైద్యాధికారులను, ఏఎన్ఎమ్ లను ఆరా తీశారు.. రికార్డులను పరిశీలించి, బిపి, హీమోగ్లోబిన్, బరువు తదితర అంశాలతో పాటు గర్భవతులుగా రిజిస్టర్ అయినప్పటి నుండి అంగన్వాడి వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు, మెడికల్ ఆఫీసర్‌లు ఏవిధమైన పోషకాహారం, చికిత్స అందించారని క్షుణ్ణంగా పరిశీలించారు. కమిటీ సభ్యుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మాతృ మరణాలకి సంబంధించి క్లిష్టమైన కేసులు ఏవైనా ఉంటే కమిటీ మెంబర్లు ఖచ్చితంగా సంబంధిత హాస్పిటల్ ని తనిఖీ చేసి వైద్య సిబ్బందితో మాట్లాడి, నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆదేశించారు. నివేదికను బట్టి తగిన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని సూచించారు. కొన్ని కేసులకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు హాజరు కాకపోవడంతో కుటుంబ సభ్యులను సమావేశానికి పిలిచినట్లు అక్నాలెడ్జ్మెంట్ కూడా తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. మాతృ మరణాల నివారణకు వీలుగా ఇంతవరకు జరిగిన మరణాల కేస్ లను అధ్యయనం చేసి, ఏమి జరిగింది, ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఎలాంటి చర్యలు తీసుకుని ఉండాల్సి ఉంది వంటి అన్ని అంశాలతో నివేదికను తయారుచేసి అన్ని హాస్పిటల్‌లకు అందచేస్తే, ఉపయోగం ఉంటుందని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు 8,9 నెలల్లో ప్రతి వారం పరీక్షలు నిర్వహించి, వారు ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు హై బిపి ఉన్నట్లయితే, వారి కుటుంబ సభ్యులను ఒప్పించి హాస్పిటల్‌లో చేర్పించాల్సిన బాధ్యత మెడికల్ ఆఫీసర్ల మీద ఉందన్నారు... గర్భిణీ స్త్రీలకు ప్రసవానికి ముందు, ప్రసవం తర్వాత చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించకూడదని కలెక్టర్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్వో డా.శాంతి కళ, కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, సిడిపిఓలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఏప్రిల్ 23 :** జిల్లాలోని 8 నుండి 12 తరగతి విద్యార్థులకు వేసవి సెలవుల్లో వర్చువల్ విధానంలో వివిధ అంశాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లోనైపుణ్య శిక్షణ కు సంబంధించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు వేసవి సెలవులలో వర్చువల్ విధానంలో 21 వ సెంచరి ఐఏఎస్ అకాడమీ, హైదరాబాద్ వారి ద్వారా నైపుణ్య కోర్స్ ను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ, పేద, మధ్య తరగతి పిల్లలు సైతం జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపిక అయ్యేందుకు ఈ ఫౌండేషన్ కోర్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, అలాగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ వేసవి సెలవులలో పిల్లలు తమ ఇంటి వద్దే ఉండి ఆన్‌లైన్‌లో ఈ కోర్స్‌ను నేర్చుకోవచ్చుని, కృష్ణప్రదీప్ 21వ సెంచరీ ఐఎఎస్ అకాడమీ, హైదరాబాద్‌కు చెందిన సీనియర్ ఫాకల్టీ ఈ సబ్జక్ట్స్ పై పూర్తి అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లా విద్యా శాఖాధికారి శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఈ క్లాస్‌లను యూట్యూబ్‌లో కూడా ఉంచుతా మని, ప్రతిరోజు జరిగిన పాఠ్యంశాలపై హోమ్ వర్క్ కూడా ఉంటుందని, మెటీరియల్ పిడిఎఫ్‌లో విద్యార్థి మొబైల్‌కు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పనాధికారి సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

**- సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి - స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ**






**ప్రొద్దుటూరు, పెన్ పవర్ ఏప్రిల్ 23 :** ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని డ్రైనేజీ కెనాల్ వ్యవస్థను ఆధునాతనంగా పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలను తక్షణమే చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశ మందిరంలో.. ఏర్పాటు చేసిన ప్రొద్దుటూరు నియోజకస్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వాణిజ్యపరంగా పేరున్న ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఎప్పటినుండో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి, అధునాతన, సాంకేతిక పద్ధతితో భూగర్భ డ్రెయినేజీని చేపడుతామన్నారు. అందుకోసం పట్టణములోని అన్ని ప్రధాన డ్రైనేజీ కాలువలు ఆనుకుని ఉన్న నివాసాలు, ఆక్రమ కట్టడాలను తొలగించి, కాలువలను విస్తరించేందుకు ప్రణాళికలు చేపట్టాలన్నారు.

అందుకోసం ఎన్ క్రోచ్మెంట్ నిర్వాసితులకు ప్రత్యామ్నాయ నివాస సదుపాయాలను హౌసింగ్ పథకం ద్వారా, లేదా ఖాళీగా ఉన్న టిడ్కో గృహ సముదాయాల్లో కల్పించాలన్నారు. అవసరమైతే.. భూసేకరణ చేపట్టి వారికి పునరావాసం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధి నుండి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించి ఉన్న మదూరు కాలువ సమస్యను కూడా శాస్వితంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే మైలవరం కాలువ ఇరిగేషన్ అవసరాలకు ఉపయోగపడటం లేదని.. కాలువ ఆయకట్టు భూములన్నీ రియల్ ఎస్టేట్ కట్టడాలతో నిండిపోయిందని.. కాలువను ఉపయోగంలోకి తీసుకువచ్చే మార్గాలను వెతకాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పాత మున్సిపల్ కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు పెండింగ్ లో ఉన్నాయని.. అందుకు సంబంధించి గతంలో సాంక్షన్ అయిన నిధుల వివరాలు, ప్రస్తుతం అవసరం అయ్యే నిధుల ఎస్టిమేషన్ ప్రతిపాదనలను తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అంతేకాకుండా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రయివేటు, ప్రభుత్వ ప్రాపర్టీకి సంబంధించిన పెండింగ్ లోవుంబ పన్నుల వసూళ్ల వివరాలను సేకరించారు. ముఖ్యంగా ప్రొద్దుటూరులో అభివృద్ధి తోపాటు ఆదాయాన్ని కూడా పెంచే మార్గాలను పెంచాలన్నారు. పట్టణ పరిధిలోని అన్ని నివాస ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ప్రతి కట్టడానికి బిల్డింగ్ పర్మిషన్ తీసుకునేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.

ఈ ప్రక్రియను ప్రజలకు మరింత సులభతరం చేస్తూ... ప్రజలను మధ్యవర్తుల వద్దకు వెళ్లకుండా మున్సిపల్ అధికారులే ప్రత్యేక మేళా ద్వారా.. ప్రతి ఒక్కరూ టౌన్ ప్లానింగ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణములోని అన్ని ప్రధాన కూడళ్లు, రహదారుల్లో సిసి కెమెరాల నిఘాను పటిష్టం చేయాలన్నారు. పట్టణంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రొద్దుటూరులో హౌసింగ్ పథకం క్రింద పేదలకు మంజూరైన ఇళ్లు, టిడ్కో గృహ సముదాయాలు వాటి పరిస్థితిపై జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులతో సమీక్షించారు. ఆర్అండ్‌బి శాఖ ద్వారా నియోజకవర్గంలో జరుగుతున్న రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఎక్కడ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, భవన నిర్మాణాలకు సంబంధించి.. ఎక్కడైనా ఫారెస్ట్ క్లియరెన్స్, ఫారెస్ట్ ల్యాండ్ లో చేపట్టిన సామాజిక కట్టడాలు, వాటిపై వస్తున్న అభ్యంతరాలు, ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం త్వరలో ప్రభుత్వం ద్వారా ఒక కమిటీ వేయడం జరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యాన పంటలతో పాటు పశుసంపదను, పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్నారు. అందుకోసం డిఆర్డీఏ, మెప్మా, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ప్రత్యేక.ప్రణాళికలు రూపొందించాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను పటిష్టం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం.. రైతులకు అనేక రకాల రాయితీలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు తరువాయి 5లో..

## ఏప్రిల్ నెలాఖరుకు కర్ణాటక నుండీ కుంకీ ఏనుగుల రాక

**- ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి**



**పలమనేరు ఏప్రిల్ 23, పెన్ పవర్ :** పలమనేరు మండలం పెంగరగుంట పంచాయతీ మొసలి మడుగు వద్ద బుధవారం అటవీశాఖ రేంజర్ నారాయణ, ఇతర అధికారులు,నాయకులతో కలసి కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు చేస్తున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను పరిశీలించడానికి ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అక్కడకు చేరుకుని పనులు పరిశీలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రానికి ఈ ఏప్రిల్ నెల చివరకు కర్ణాటక రాష్ట్రం నుండీ కుంకీ ఏనుగులు రానున్నాయని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో రైతులు మరియు ప్రజల ప్రాణ,ఆస్థి నష్టాల నివారణ జరుగుతుందని అన్నారు. అంతే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెండుగా కలుగనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో మండల నాయకులు నాగరాజు రెడ్డి, జగదీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేయండి : జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్, 23 :** జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై కమిటీ సభ్యులచే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా టూరిజం అధికారి సత్యనారాయణమూర్తి, ఏపీటీడీసీ డివియం లక్ష్మీ నారాయణ, ఇరిగేషన్ ఎస్ఈ ఎన్.శివప్రసాద్ రెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి నాగమునేశ్వరీ, డిఎస్డిఓ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పాణ్యం, సంగమేశ్వరం, సంజామల, బోయవాండ్లపల్లె గ్రామాల్లో గతంలో పర్యాటక అభివృద్ధి కోసం భూములను కేటాయించడం జరిగిందని సదరు భూములను మ్యూటేషన్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా పర్యాటక రంగ అభివృద్ధి కోసం కేటాయించిన భూములను దురాక్రమణలకు గురికాకుండా పాణ్యం, సంగమేశ్వరం ప్రాంతాల్లో కంచె ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు తయారుచేయాలని పర్యాటక అభివృద్ధి అధికారిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అహోబిలంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించి 2.5 ఎకరాల భూమి కేటాయిస్తే అందులో త్రీ స్టార్ హోటల్ ఏర్పాటు చేయడంతో పాటు బండి ఆత్మకూరు మండలం పడమటూరు గ్రామంలో కెసి కెనాల్ కు పరీవాహక ప్రాంతానికి చెందిన 2 ఎకరాలు కూడా టూరిజంకు కేటాయిస్తే అందులో బోటింగ్, చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేస్తే టూరిజం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. సున్నిపెంట ప్రాంతంలో 178 ఎకరాల రెవెన్యూ భూములను గుర్తించామని అందులో పర్యాటకానికి అవసరమైన 50 ఎకరాలు గుర్తించాలని పర్యాటక అధికారిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా బెల్లుం గుహలు, మహానంది, అహోబిలంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అహోబిలం ప్రాంతంలో స్వదేశీ దర్శన్ కార్యక్రమం ద్వారా ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ ఏర్పాటు చేస్తున్నామని అందులో పార్క్, రెస్టారెంట్, ఫిల్మ్ థియేటర్ తదితర ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక అధికారి జాయింట్ కలెక్టర్‌కు వివరించారు.

# హాస్పిటల్‌లో చలువ పందిళ్లు



**తిరుపతి, పెన్ పవర్, ఏప్రిల్ 23 :** శ్రీ వేంకటేశ్వర రామ్ నారాయణ్ రుయా ప్రభుత్వ సర్వ జన వైద్యశాలలో రోగుల, వారి సహాయకులకు వేసవి కాలంలో ఎండకు ఉపశమనార్ధం హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ మరియు తిరుపతి జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్.ఎస్ ఆదేశాల మేరకు హాస్పిటల్ అధికారులు, APMSIDC అధికారులతో కలిసి హాస్పిటల్‌లో 8.5 లక్షల ఖర్చుతో చలువ పందిళ్ళు ఏర్పాటు చేయించడం జరిగింది. ఇవి ప్రత్యేకంగా క్యాజువాలిటీ, ఓపీ విభాగం, CT Scan, MRI Scan, X ray,అల్ట్రాసౌండ్ మరియు రక్త పరీక్షలకు వెళ్ళే రోగులకు, సహాయకులకు ఉపశమనం కలిగించుచున్నవి. ఈ చలువ పందిళ్ళు 3 నెలల పాటు రోగుల సౌకర్యార్ధం ఉంచబడుతుంది. హాస్పిటల్ అధికారులు, ఈ విషయమై హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్, కలెక్టర్‌కి, అట్లే HDS కో చైర్మన్, తిరుపతి శాసన సభ్యులు, ఆరణి శ్రీనివాసులుకి అభినందనలు తెలియజేసారు.

# మైదుకూరు జెడ్పీ బాలికల పాఠశాలకి అఖండ విజయం.. ప్రతిభకి ప్రశంసలు...







**మైదుకూరు, పెన్ పవర్ ఏప్రిల్ 23 :** మైదుకూరు మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పదవ తరగతి ఫలితాల్లో తమ ప్రతిభతో మండలాన్ని గర్వించేందుకు లోను చేశారు. ఈ సంవత్సరం జరిగిన పదవ తరగతి పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. 579 మార్కులతో నేరెళ్ల చంద్రలేఖ మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఆమె అనంతరం 575 మార్కులతో పర్హానా ద్వితీయ స్థానం, 561 మార్కులతో నిహారిక తృతీయ స్థానం సాధించారు. ఈ విజయాల్లో ముఖ్యంగా గుర్తించదగిన విషయం ఏమంటే, పాఠశాల నుంచి మొత్తం 11 మంది విద్యార్థులు 500 కన్నా ఎక్కువ మార్కులు సాధించారు. ఈ సంవత్సరానికి పాఠశాల ఉత్తీర్ణత శాతం 73% గా నమోదైంది. ఈ సందర్భంగా శ్రీమతి ఎస్. జి. భవానీ దేవి గారు, ప్రధానోపాధ్యాయురాలు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మైదుకూరు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఈ విజయాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, ఇదే ధోరణిలో చదువును కొనసాగించాలని సూచించారు.

## పుస్తకాలే నిజమైన సంపద : తులసినాథం నాయుడు




**పలమనేరు ఏప్రిల్ 23, (పెన్ పవర్) :** మనిషికి అన్ని సంపదల కన్నా పుస్తక సంపద నిజమైన సంపద అని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు అన్నారు. బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని కళామందిరంలో వేసవి సెలవులలో చదువుకోవడానికి వీలుగా కొన్ని రకాల కథల పుస్తకాలు, పద్యాలు పుస్తకాలను విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫోన్ తలదించుకునేలా చేస్తే, పుస్తకం తల ఎత్తుకునేలా చేస్తుందన్నారు. విద్యార్థులు పుస్తకాలతో స్నేహం చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ సీతలాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 23 :** తొట్టంబేడు మండలం, పెద్దకనపర్తి గ్రామంలో గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ శీతలాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి మరియు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు, పెద్దకనపర్తి ప్రజలు స్వాగతం పలికిన అనంతరం శ్రీశ్రీశ్రీ శీతలాంబ వారి శ్రీపోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శేష వస్త్రం సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మణి నాయుడు,అంజూరు రఘురామయ్య, అంజూరు వసంతయ్య,అంజూరు కృష్ణ, కనపర్తి పాపయ్య, కనపర్తి చలపతి, పసుపులేటి సుధాకర్, తిరుపాల్, గోపి, సుబ్రహ్మణ్యం, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధనమున్న రాయల్, మాజీ కౌన్సిలర్ కంఠ ఉదయ్ కుమార్, నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్,మైనంపాటి దయాకర్, ప్రసాద్, అంకయ్య, గంగయ్య యాదవ్, పసుపులేటి చిన్నా, అంజూరు మణి ,అంజూరు వెంకటేష్, అంజూరు శేఖర్, కానగల పద్మనాభం, కానగల పురుషోత్తం, వీరస్వామి, రాజా, రవి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పదవ తరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి

## పైకి నెగ్గి విజయం సాధించిన ప్రైవేటు విద్యార్థులు







**పలమనేరు ఏప్రిల్ 23, (పెన్ పవర్) :** గంగవరం మండలంలో 2024-25 విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో బాలికలదే పైచేయిగా నిలిచింది.మండలం లోని 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలు వచ్చాయి. వీటికి 2 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు గట్టిగా పోటీపడి మరీ ముందంజలో ఉన్నారు. 551 మందికి గాను 373 మంది విజయం సాధించి 68శాతం ఉత్తీర్ణత పొందగా, ప్రైవేటు పాఠశాలలు 137 మందికి 132 మంది 96 శాతంతో ఉత్తీర్ణత సాధించి ముందంజలో ఉన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పత్తికొండ 93శాతం,మేలుమాయి89,కేజీబీవీ 89, గొర్రెలదొడ్డి 84 మామడుగు 80 శాతం రాగా,600మార్కులకు గాను జిఎల్ఎస్ ఫారం విద్యార్థి హారతి 576, కీలపట్ల పూజిత 574,లావణ్య 572సాధించారు.

**తగ్గేది లేదని నిరూపించిన ప్రైవేటు విద్యార్థులు :** కృష్ణారెడ్డి శ్రీచైతన్య చిల్డ్రన్ అకాడమీ విద్యార్థి తరుణ్ కుమార్ 592,చందు 589, అలాగే యూనివర్సల్ హైస్కూల్ విద్యార్థి మోక్షిత అంజుమ్ 588 మార్కులతో మండలంలోనే ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా ఇంతటి ఫలితాలు రావడానికి కారకులైన విద్యార్థులను, ఉపాధ్యాయులను మండల విద్యాశాఖా ధికారులు వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.

# కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషం : డాక్టర్ తులసి రెడ్డి



**కడప పెన్ పవర్ ఏప్రిల్ 23 :** మంగళవారం కాశ్మీర్ లో అనంతనాగ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో 28 మంది పర్యాటకులు చనిపోవడం 12 మంది తీవ్రంగా గాయపడడం అమానవీయం, శోచనీయం, విషాదకరం అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇది ఉన్మాద చర్య, పిరికిపంద చర్య అన్నారు. పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లష్కర్-ఏ-తోయిబా ఉగ్రవాద సంస్థ స్థానిక శాఖ రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడి చేసినట్లు ప్రకటించుకోవడం గమనార్హం. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించి వేయాలని కేంద్ర ప్రభుత్వానికి, కాశ్మీర్ ప్రభుత్వానికి తులసి రెడ్డి సూచించారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకుల పవిత్రాత్మలకు ప్రశాంతిని ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

# శ్రీ మధుసూదన ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో టెన్త్‌లో అద్భుత ఫలితాలు





**కడప పెన్ పవర్ ఏప్రిల్ 23 :** కడప నగరం శ్రీ మధుసూదన ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో టెన్త్‌లో అద్భుత ఫలితాలు సాధించారు. 600కు గాను 565, 521 మార్కులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ వంశీ ప్రసాద్ తెలియజేశారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, పాఠశాల సిబ్బంది, కరస్పాండెంట్, ప్రిన్సిపల్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## ఉరి వేసుకున్న మహిళను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి



**పలమనేరు ఏప్రిల్ 23, (పెన్ పవర్) :** ఉరి వేసుకున్న మహిళను కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిసింది. ఈమేరకు ఆసు పత్రి వర్గాలు తెలిపిన సమాచారం మేరకు గంగవరం మండలంలోని కూర్ని పల్లి గ్రామంలో సుబ్రహ్మణ్యం భార్య శైలజ మంగళవారం రాత్రి ఉరి వేసుకుం దని గమనించిన కుటుంబీకులు హుటాహుటిన పలమనేరు ఏరియా ఆసుపత్రికి తీసుకుని రాగా, చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయడంతో మార్గమధ్యంలో మృతి చెందిందని తెలిపారు. కాగా ఘటనపై పోలీసులకు సమాచారం అందించి పోస్టుమార్టంకు తరలించామన్నారు. కాగా శైలజ ఉరి వేసుకుందా లేదా మరి ఇంకేదైనా కారణం ఉందా అన్న విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

# ద్రావిడ వర్సిటీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



**కుప్పం/పెన్ పవర్/ఏప్రిల్ 23 :** ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రూసా నిధులతో నూతనంగా నిర్మించిన నందమూరి తారక రామారావు క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లో బుధవారం అత్యాధునిక వసతులతో నిర్మించబడిన కంప్యూటర్ ల్యాబ్ ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం. దొరస్వామి ప్రారంభించారు. నేటి నుంచి ఈ కంప్యూటర్ ల్యాబ్ ను విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు అందు బాటులోకి తీసుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రస్థాయి ఉమ్మడి ప్రవేశ పరీక్షలను నిర్వహించుటకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. కిరణ్ కుమార్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య కే. శ్యామల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయవర్ధిని, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, యూనివర్సిటీ ఇంజనీర్ ఎం సి. రఘుపతి మరియు ఆచార్యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం

## ఆర్.ఎస్.కె.సిబ్బంది ద్వారా రైతులకు అవగాహన కల్పించండి : జిల్లా కలెక్టర్





**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 23 :** ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం మెండుగా ఉంటుందని, ఆర్ఎస్కెల ద్వారా ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంపుపై జిల్లా కలెక్టర్ వ్యవసాయ మరియు ఉద్యాన శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, ఏపీఎంఐపీ బాలసుబ్రమణ్యం,3ఎఫ్, అమ్మ గోద్రెజ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, మురళి కుమార్, హరీష్, మురళీధర్, ఆర్ఎస్కె ఇన్‌ఛార్జిలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఖైదీలతో సీనియర్ సివిల్ జడ్జి ముఖాముఖి



**కడప పెన్ పవర్ ఏప్రిల్ 23 :** రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారి ఆదేశాను సారంగా డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి సూచనల మేరకు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-మరియు-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు కడప పురుషుల కేంద్ర కారాగారమును మరియు



ప్రత్యేక మహిళా కారాగారాన్ని విజిట్ చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు దోషిగా నిర్ధారించినప్పటికీ, ఖైదీ ఇంకా భారత సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేయని విషయం, ఖైదీలతో మాట్లాడుతూ శిక్ష నుంచి ఉపశమనం పొందేందుకు అర్హత ఉన్న ఖైదీలను గుర్తించడం, ఖైదీలు ఇంకా అపిల్ దాఖలు చేయని విషయాలు, ఖైదీలు శిక్షకాలంలో సగం లేక సగానికి పైగా జైల్లో ఉండి బెయిల్ ప్రార్థనను హైకోర్టు తిరస్కరించిన విషయాలు, ఖైదీల ముందస్తు విడుదలను రాష్ట్ర శిక్ష సమీక్ష బోర్డు తిరస్కరించి, ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలు మొదలు అంశాలను వివరించడం జరిగినది. ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 వివరించారు. ఈ కార్యక్రమంలో కడప పురుషుల కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి రాజేశ్వరరావు, ఉప పర్యవేక్షణ అధికారి పి.రమేష్, ప్రత్యేక మహిళ కేంద్రకారాగార ఇంచార్జ్ సూపరిండెంట్ శ్రీమతి భువనేశ్వరి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది శ్రీమతి ఎమ్ చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ లీగలై డిఫెన్స్ కౌన్సిల్ లు ప్రవీణ్ కుమార్, శ్రీమతి సౌజన్య, అక్బర్ అలీ, రవితేజ, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ జెండా అవనతం



**శ్రీకాళహస్తి,పెన్ పవర్, ప్రతినిధి,ఏప్రిల్ 23 :** పెహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళులు అర్పించిన శ్రీకాళహస్తి జనసేన ఇంఛార్జి వినుత కోటా,పార్టీ నేతలు. జమ్ము కాశ్మీర్‌లోని బైసారన్ దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు తెగబడి 28 మందిని కాల్చి వేయడాన్ని ఖండిస్తూ జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆదేశాల మేరకు మూడు రోజులపాటు సంతాప దినాలు పాటిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం శ్రీకాళహస్తి పట్టణం లోని నియోజకవర్గ జనసేన కేంద్ర కార్యాలయంలో ఇంఛార్జి వినుత కోటా జనసేన పతాకాన్ని అవనతం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావలి శివకుమార్, పేట చంద్ర శేఖర్, తోట గణేష్, రవి కుమార్ రెడ్డి, పేట చిరంజీవి, లక్ష్మి, నితీష్, రాజ్య లక్ష్మి, జ్యోతీ రామ్, సురేష్, దుమ్ము రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్












**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 23 :** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదివి నేడు వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నేడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అభినందించి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇలాగే జిల్లాలో మంచి ఫలితాలను తీసుకువచ్చి జిల్లాకు మరియు తల్లి దండ్రులకు మంచి పేరును తీసుకురావాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించేలా విద్యార్థుల వెన్నంటే ఉండి కృషి చేసిన విద్యాశాఖ, ప్రభుత్వ పాఠశాలలలోని ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లాలో నేడు వెలవడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలు

1. కే.ఇంద్రజ(594/600) దక్కిలి మండలం, చాపలపల్లి మున్సిపల్ హై స్కూల్
2. ఎం సేవిత (591/600) జడ్పీ హైస్కూల్ కోటకాడపల్లి ఎర్ర వారి పాలెం మండలం
3. ఏ.వందన (589/600) జడ్పీ హైస్కూల్, మైనకురు, నాయుడుపేట మండలం
4. ఏ కేతన్ (589/600) మున్సిపల్ హై స్కూల్ అగ్రహారం పల్లి.

# కాశ్మీర్లోఅమాయకులను చంపడం దారుణం

## - ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్



**చిత్తూరు/పెన్‌పవర్/ఏప్రిల్ 23 :** కాశ్మీర్లో అమాయకులైన పర్యాటకులను చంపడం దారుణమని, ఉగ్రవాదులది పిరికిపంద చర్య అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు.అమాయకులైన 25 మంది పర్యాటకలను పాశవికంగా దాడి చేసి చంపటం క్రూరమైన చర్య. ఇలాంటి వాటిని ఉపేక్షించరాదు.ఈ విషాదం మాటలకందనిది, ఈ విపత్కర పరిస్థితుల్లో భారతీయులంతా కలిసికట్టుగా ఉన్నామని నినాదాన్ని బలంగా ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలన్నారుబాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.బాధిత కుటుంబాలు త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపాడు.

## క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి



(3వ పేజీ తరువాయి) పరీక్ష ఫలితాలలో విద్యార్థులు 81.5 శాతం ఉత్తీర్ణత సాధించడం ఈ రాష్ట్ర ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధి అని తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టి.టి.డి బోర్డ్ మెంబర్ పనబాక లక్ష్మి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రో.ఉమ, మాజీ ఎం.ఎం.ఏ సుగుణమ్మ, డిప్యూటి మేయర్ లు ముద్ర నారాయణ, మునికృష్ణ, డి.ఎస్.డి.ఓ సయ్యద్ సాహెబ్, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రొద్దుటూరు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

(3వ పేజీ తరువాయి) సహాయ సహకారాలను అందిపుచ్చుకుని కుటుంబ అభివృద్ధితో పాటు, సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. వాణిజ్యపరంగా పేరున్న ప్రొద్దుటూరు పట్టణంలో గ్యాంబ్లింగ్, బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలను, గంజాయి అమ్మకాలను సమూలంగా తుడిచి పెట్టేందుకు పోలీస్, రెవెన్యూ యంత్రాంగం పారదర్శకంగా, నిక్కచ్చిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ.. విలువలతో కూడిన నాయకత్వం, పారదర్శకత తో కూడిన విధి నిర్వహణ అధికారులను కానీ, నాయకులను కానీ అత్యున్నత స్థాయికి తీసుకువెళుతాయని తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో అన్ని స్మశాన వాటికలలో అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. పలుచోట్ల స్మశాన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, అలాంటి స్థలాలను కాపాడుకునేందుకు ప్రహరీ గోడలను నిర్మించేందుకు చర్యలు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం డ్వామా, డిఆర్డీఏ, మెడికల్, ఐసిడిఎస్, విద్యాశాఖ, వ్యవసాయ మార్కెటింగ్, విద్యుత్ శాఖ, పరిశుభ్యం, రవాణా, ట్రాఫిక్, పరిశ్రమలు, వాణిజ్యం తదితర అంశాలపై... సంబందిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు సమీక్షించి పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లాస్థాయి, డివిజనల్, నియోజకవర్గ స్థాయి అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### పహల్గాం ఉగ్రదాడి పిరికిపంద చర్య : రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ, పెన్ పవర్ ఏప్రిల్ 23 : ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్న రక్షణ మంత్రి. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమన్న రాజ్‌నాథ్. పహల్గాం ఉగ్రదాడికు అతి త్వరలోనే ప్రతీకారం తీర్చుకుంటాం. ఉగ్రవాదులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఎవరూ ఊహించని రీతిలో బదులిస్తాం. త్రివిధ దళాలు నిత్యం అప్రమత్తంగా ఉండాలి. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.

### కడప యువతి కె.ఎస్.కీర్తి రెడ్డికి సివిల్స్-లో 316 ర్యాంక్



కడప, పెన్ పవర్, ఏప్రిల్ 23 : కడప నగరానికి చెందిన కర్ణపు చెలమారెడ్డి, శ్రీ కృష్ణా దంపతుల ప్రధమ కుమార్తె కె. శ్రీనివాస కీర్తి రెడ్డి సివిల్ సర్వీసెస్- 2024 తుది ఫలితాలలో 316 ర్యాంక్ సాధించారు. ఆమె బిట్స్ పిలానిలో ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అంతకు ముందు కడపలో పదో తరగతి వరకు చదువుకున్నారు. వారి తల్లి కడప ఎల్ఐసి బ్రాంచ్‌లో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తుండగా, తండ్రి ఎల్ఐసి ఉద్యోగిగా 2024 లో పదవీ విరమణ చేశారు. కీర్తి రెడ్డి సాధించిన ఈ విజయం పట్ల ఎల్ఐసి కడప, విజయవాడ ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు. మూడు సంవత్సరాల వివాహం అనంతరం కూడా కుటుంబ సహకారంతో ఆమె సాధించిన ఈ విజయం తోటి మహిళలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే ఎంత పెద్ద లక్ష్యమైనా చేరుకోవచ్చునని ఆమె విజయం మనకు తెలుపుతుంది.

### పహల్గాం దాడిపై నిరసన కార్యక్రమంలో పాల్గొన్న తలపా దామోదరం రెడ్డి



శ్రీకాళహస్తి,పెన్ పవర్, ప్రతినిధి,ఏప్రిల్ 23 : పహల్గాం దాడి ఘటనపై నిరసన తెలియజేస్తూ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి లో సామాన్య ప్రజలు చనిపోవడం, మరికొంత మంది గాయపడటం యావత్ భారతదేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని, మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నామని, గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని. ఇటువంటి తీవ్రవాద దుశ్చర్య పిరికిపందచర్య అని అమాయకుల ప్రాణాలను బలి కొన్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా నిలబడాలని అలాగే ఉగ్రవాదంపై పోరుకు యావత్ దేశం కలిసి కట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలి అని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, వెంకటరత్నం ఆంటోనీ, శ్రీకాళహస్తి మండల యువత అధ్యక్షులు నవీన్, నాగరాజు,మహేష్, చిరంజీవి,అరుణ్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకి స్వాగతం పలికిన కలెక్టర్






తిరుపతి, పెన్ పవర్, ఏప్రిల్ 23 : తిరుపతి జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మరియు మధ్య తరహా సంస్థలు వారితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మరియు మధ్య తరహా సంస్థల, సర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశం మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండర్ల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు



కడప, పెన్ పవర్ ఏప్రిల్ 23 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు /జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి.కబర్ధి ఆదేశాల మేరకు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం న్యాయ సేవ సదన్ నందు ట్రాన్సెండర్ల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గారు ట్రాన్స్జెండర్ల ప్రయోజనం కోసం అందుబాటులో ఉన్న పథకాలు గురించి తెలియజేశారు.

వారికి ఐడి కార్డ్స్ టిజి ఐడిల నేషనల్ పోర్టల్ లో అప్లై చేసుకొంటే వస్తాయని తెలిపారు. కొంతమంది ట్రాన్స్ జెండర్స్ తమకు ఐడి కార్డ్స్ మరియు రేషన్ కార్డులు లేవని జడ్జి గారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్డ్స్ లేనందువలన తమకు పింఛన్లు రావడం లేదని తెలిపారు. జడ్జిగారు వీరి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దివ్యాంగులు మరియు ట్రాన్స్ జెండర్స్ అండ్ సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమా మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్స్‌కు ఉన్న వివిధ గవర్నమెంట్ పథకాల గురించి వారికి వివరించారు. ట్రాన్స్ జెండర్ల స్వయం ఉపాధి కల్పన కొరకు వివిధ బ్యాంకుల నుండి ఆన్లైన్ లో లోన్లు ఎలా తీసుకోవాలో వాటి గురించి కూడా వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ లోన్ కావాలనుకున్నవారు ఈనెల 14.4. 2025 నుంచి వచ్చే నెల 13.5 2025 లోపల ఆన్లైన్ లో అప్లై చేసుకోవచ్చు అని తెలిపారు. వారికి సబ్సిడీ కూడా లభించును అని తెలిపారు. ప్యానల్ న్యాయవాది హేమలత గారు మాట్లాడుతూ న్యాయ సహాయం లభించడంలో తోడ్పడుతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్జెండర్ల లీడర్లు వీణా రెడ్డి, శ్రీవాణి, పావని, ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.



## పక్కా వ్యూహం ప్రకారమే కశ్మీర్‌లో ఉగ్రదాడి!









కడప, పెన్ పవర్ ఏప్రిల్ 23 : జమ్మూకశ్మీర్‌లో పక్కా వ్యూహం ప్రకారమే ఉగ్రదాడి జరిగినట్లు తెలుస్తోంది. అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్‌కు మంగళవారం ఆర్మీ యూనిఫామ్‌లో ఏడుగురు ఉగ్రవాదులు వచ్చారు. బైసరన్‌లో టూరిస్టులను టెర్రరిస్టులు టార్గెట్ చేశారు. ట్రెక్కింగ్ టూర్‌కు వెళ్లిన టూరిస్టులను ఉగ్రవాదులు చుట్టుముట్టి వారి ఐడీ కార్డులు చెక్ చేశారు. పేరు, మతం అడిగి తన భర్తపై కాల్పులు జరిపారని ఓ బాధితురాలు పేర్కొంది.

**జమ్మూకశ్మీర్ ఘటన.. ఐడీ కార్డులు చూసి చంపేశారు**

జమ్మూకశ్మీర్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లిన టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో ఇప్పటికే ముగ్గురు మృతి చెందారు. అయితే ఉగ్రవాదులు ఆర్మీ యూనిఫాంలో వచ్చి దాడి చేశారని బాధితులు చెబుతున్నారు. ఐడీ కార్డులను చెక్ చేసిన తర్వాత కాల్పులు జరిపారన్నారు. అయితే తాజాగా దాడికి పాల్పడింది తామే అంటూ టీఆర్ఎఫ్ ప్రకటించింది. ఈ ఘటనను జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు.

**ఉగ్రవాదుల దాడిలో 27 మంది మృతి?**

జె&కెలో ఉగ్రవాదుల దాడిలో 25 మంది టూరిస్టులు మరణించినట్లు సమాచారం. తొలుత ముగ్గురు చనిపోగా, మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. ఉగ్రవాదులు ఆర్మీ యూనిఫాంలో వచ్చారని, ఐడీ కార్డులు పరిశీలించి ముస్లీములు కాని వారిని కాల్చి చంపారని ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. పుల్వామా తర్వాత ఇదే అతిపెద్ద అటాక్ అని జాతీయ మీడియా పేర్కొంటోంది. ఎంత మంది మరణించారనేది అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

## జమ్ము కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ జర్నలిస్టులు భారీ ర్యాలీ



రేణిగుంట/పెన్ పవర్/ ఏప్రిల్ 23 : జమ్ము కాశ్మీర్లోని పహల్గామ్‌లో అమాయక టూరిస్టులపై జరిగిన ఉగ్రవాదుల దాడుల నశించాలని రేణిగుంట జర్నలిస్టులు క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. బుధవారం పట్టణంలోని కస్తూరి గాంధీ విగ్రహం వద్ద రేణిగుంట జర్నలిస్టులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ శివమూర్తి మాట్లాడుతూ ఉగ్రవాద దాడులు నశించాలని కోరారు. పహల్గంలో అమాయకులైనా టూరిస్టులపై జరిగిన దాడిని ఖండించారు. ఉగ్రవాదులు దాడుల్లో పిరికిపంద చర్య అని మండి పడ్డారు. ఇది హేయమైన చర్యనీ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. విహారయాత్రకు వచ్చిన వారిపై తుపాకులతో దాడి చేసి 27 మంది పర్యాటకులు మృతి చందారని అన్నారు. ఈ దాడి పట్ల తీవ్ర బాధను వ్యక్తం చేశారు. పెదాడులో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. పహల్గామ్‌లో జరిగిన ఈ దాడి తీవ్రంగా కలిచి వేసిందన్నారు. సైనిక దుస్తుల్లో వచ్చిన ఏడుగురు ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారని ఈ చర్యను దుర్మార్గమైన ఘటనని అన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారికి రేణిగుంట జర్నలిస్టుల తరపున సానుభూతి తెలుపుతున్నామన్నారు. అనంతరం కస్తూరిబాయ్ గాంధీ విగ్రహం నుండి పటం లోని పురవీధుల గుండా జర్నలిస్టులో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలతో పట్టణంలో జర్నలిస్టుల హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల ఉమేష్, చిన్నారావు, మణి, భాగ్యరాజ్, మధు, కృష్ణమూర్తి, సత్య రాజ్, మురళి యాదవ్, శివ, రాజశేఖర్, జలిల్ కృష్ణంరాజు, రమేష్, , అప్సర్, మురళి, గణేష్, నాగూర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్ర దాడిపై తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఖండన



తిరుపతి/పెన్ పవర్/ ఏప్రిల్ 23 : జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. అమాయక పర్యాటకులపై జరిగిన ఈ కిరాతక దాడిని ముష్కర మూకల పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించరాదని అన్నారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేసిన ఈ దాడి దేశ శాంతి భద్రతలను భంగ పరిచే చర్యగా అభివర్ణించారు. రాజకీయాలకు అతీతంగా, ఈ దాడులకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడవలసిన సమయం ఇదని తెలిపారు. బాధితులకు తగిన న్యాయం జరిగే విదంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తెసుకోవాలని కోరారు. అలాగే ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు ఎంపీ గురుమూర్తి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## వందశాతం ఫలితాలతో శ్రీశారదా ఇంగ్లీష్ మీడియం హైస్కూలు



పలమనేరు ఏప్రిల్ 23, (పెన్ పవర్) : 2024-25 సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో పట్టణంలోని శ్రీశారదా ఇంగ్లీషు మీడియం హైస్కూలు 100 శాతం ఉత్తీర్ణత సాధించిందని పాఠశాల ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి,ప్రిన్సిపాల్ పుష్పాలతా రెడ్డిలు తెలిపారు. 600 మార్కులకు అఫీఫా కౌనైన్ 594తో ప్రథమ స్థానం సాధించిందని, తరువాత స్థానాలలో శ్వేతశ్రీ 588, లాస్య 587,లీనశ్రీ 581,లక్ష్మీచేతన 575, జశ్విత 572,అబ్దుల్ హుసేన్ 571,పనితవ్య 571 సాధించారని తెలిపారు. పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు 68 మంది. అందులో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 40 మంది ఉన్నారని, ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయ బృందానికీ, విద్యార్థిని, విద్యా ర్థులకు, తల్లిదండ్రులకు యాజమాన్యం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### శ్రీకాళహస్తి ఐఎఫ్‌టియు అనుబంధం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో 139 మే డే పిలుపు




శ్రీకాళహస్తి, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 23 : ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి రామినేని హరికృష్ణ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ఐఎఫ్‌టియు కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో మేడే ఘనంగా జరపాలని కోరారు. అదేవిధంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్ల రద్దుకై పోరాడుదాం ఐఎఫ్టియు కార్యకర్తలతో వివిధ సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ జండా ఆవిష్కరణ చేయాలని ఆయన తెలిపారు. ఐఎఫ్‌టియు నాయకులు జాకీర్ మాట్లాడుతూ మేడే రోజు వివిధ చోట్ల జెండా ఆవిష్కరించినా అనంతరం ర్యాలీ నిర్వహించి సభ జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు సీనియర్ నాయకులు వెంకటరత్నం, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.శోభ, ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి ఆర్.స్వరాజ్యలక్ష్మి, కోశాధికారి టి.కల్పన నాయకులు స్వర్ణ, జహీరా బేగం, శాంత కుమారి, వసంత తదితరులు పాల్గొన్నారు.

### ఉగ్రదాడులకు ఎన్డీఏ ప్రభుత్వం ధీటైన జవాబిస్తుంది

అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 23 : తమ దాడులతో భారతదేశంలో సమైక్యతను దెబ్బతీయాలన్న ఉగ్రవాదుల క్రూరమైన ఆలోచనలు ఇక్కడ చెల్లవని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని బైసారన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హత మార్చడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించదని వారు కచ్చితంగా తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఈ ఘటనలో అమాయక ప్రజలు చనిపోవడం చాలా బాధ కల్గించిందన్నారు. వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే దగ్గుపాటి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కశ్మీర్‌లో ఇటీవల రికార్డు స్థాయిలో పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, శాంతిభద్రతలకు విఘాతం కలిగించి ఆ ప్రాంతాన్ని అస్థిరపరిచే కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా శాంతి విద్రోహ శక్తులు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఇలాంటి వాటిని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా లు ఉపేక్షించరన్నారు. ఉగ్రవాద శక్తులను కూకటి వేళ్లతో పెకిలించేందుకు భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మా ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందన్నారు. పహల్గామ్ ఘటనలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## పాడిపేటలో రామయ్య ఊరేగింపు





తిరుపతి రూరల్/పెన్ పవర్/ఏప్రిల్ 23 : తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయితీలో గల పురాతన శ్రీరామచంద్రమూర్తి ఆలయంలో ఈరోజు ఆ స్వామివారి కుంభాభిషేకం తరువాత 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఊరేగింపు అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం రెడ్డి పెరుమాళ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, పద్మనాభరెడ్డి, వాసు, ప్రసాద్ రెడ్డి, కుమార్ రెడ్డి, బాలాజీ మరియు గ్రామ సభ్యులందరూ పాల్గొని స్వామివారి ఊరేగింపుని జయప్రదం చేయడం జరిగింది.

### ఉగ్రదాడితో మాకు సంబంధం లేదన్న పాక్



పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిపై పాకిస్థాన్‌కు ఎలాంటి ప్రమేయం లేదని ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా ఆసిస్ స్పష్టం చేశారు. పాక్ టెర్రరిజాన్ని ఎప్పటికీ ప్రోత్సహించదని, తమ దేశాన్ని దూషించడం తగదని భారత్‌ను హెచ్చరించారు. ఈ ఘటనలో తమపై అనవసర ఆరోపణలు చేయడం దురుద్దేశంతో చేసినదిగా అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, బలూచిస్థాన్ వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటోందని, అక్కడి తిరుగుబాట్లే భారత్‌లో అశాంతికి కారణమన్నారు.

## తిరుపతిలో ట్యాంకుల సుందరీకరణ

### జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 23 :** తిరుపతి నగరంలోని పలు ట్యాంకులు(కుంటలు) సుందరీకరణ పనులను ప్రాధాన్యతగా తీసికొని యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు తిరుపతి నగరం లోని వివిధ ట్యాంకర్ల సుందరీకరణ పనుల పురోగతి పై జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, తిరుపతి, శ్రీకాళహస్తి, ఆర్ డి ఓ లు రామ్మోహన్, భానుప్రకాష్ , డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి వనరులను అభివృద్ధి చేయడానికి ట్యాంకుల పునరుద్ధరించడం కోసం సుందరీకరణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా దామినేడు, పేరూరు, అవిలాల రామక్క చెరువు, తూకివాక వెంకటాపురం, వెలమండ్యం వినాయక సాగర్, పాన్ చెరువు, గొల్లవాని గుంట, కోరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా స్మార్ట్ సిటీ లో భాగంగా వినాయకా సాగర్, గొల్లవాణి గుంట ఇప్పటికే అభివృద్ధి చేశారని, మిగిలిన వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొరమేను గుంట చెరువుకు సంబంధించిన వాకింగ్ ట్రాకర్స్, ప్లాంటేషన్ సంబంధించిన అభివృద్ధి పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు.

## ప్రధాన మంత్రి వందన యోజన...






**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 23 :** జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఈరోజు 23.4.2025 న తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలోని సిడిపివోలు, ఏసిడిపిఓలు మరియు సూపర్వైజర్స్‌కి ప్రధానమంత్రి వందన యోజన పైన ట్రైనింగ్ నిర్వహించడం జరిగింది. దీనికి గాను రాష్ట్ర స్థాయి నుంచి మైనారిటీ ఆఫీసర్ మరియు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అయిన ఎం.శ్రీలక్ష్మి జిల్లా నోడల్ అధికారి ఎస్.వసంత భాయ్, సూపరింటెండెంట్ నెల్లూరు తురు నుండి రిసోర్స్ పర్సన్ పి.షైనీ రత్నా, డి.పిఏ నెల్లూరు ఎన్ వెంకటకృష్ణ, చిత్తూరు డిపిఏఏ శివయ్య ట్రైనింగ్ నిర్వహించి ఈ పథకం యొక్క మార్గదర్శకాన్ని ఈ ట్రైనింగ్ ద్వారా తెలుసుకొని క్షేత్రస్థాయిలో ఆచరించవలసినదిగా తెలియజేశారు.

### బాధిత కుటుంబాలకు ఐడిఆర్ఎఫ్ ఫండ్ నుండి 1 లక్ష రూపాయలు, విడో ఫండ్ నుండి 50 వేల రూపాయల చెక్కు





చిత్తూరు/ పెన్ పవర్/ ఏప్రిల్ 23 : చిత్తూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈరోజు ఐడిఆర్ఎఫ్ ఫండ్ నుండి 1 లక్ష రూపాయలు మరియు విడో ఫండ్ నుండి 50 వేల రూపాయల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేసిన అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్.ఆర్.రాజశేఖర రాజు. చిత్తూరు జిల్లా నుండి అటాచ్మెంట్ లో బాగంగా తిరుపతి జిల్లా నందు క్లాస్-4 ఉద్యోగినిగా విధులు నిర్వహిస్తూ 22-04-2025 వ తేదీన అనారోగ్యం కారణంగా చనిపోయిన శ్రీమతి శ్యామల కుమారి కుమారుడు పృథ్వికి ఐడిఆర్ఎఫ్ ఫండ్ నుండి 1 లక్ష రూపాయలు విడో ఫండ్ నుండి 50 వేల రూపాయల చెక్కులను చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్.ఆర్.రాజశేఖర రాజు జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన ఆఫీస్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో 'బి' సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, బి.సెక్షన్ క్లర్క్ రెడ్డెప్ప పాల్గొన్నారు.

### మనమిత్ర సర్వేపై సచివాలయ సిబ్బందికి అవగాహన /ఎంపీడీవో



**కోట/పెన్ పవర్/ఏప్రిల్ 23 :** మండల పరిధిలోని వాకాడు 1, నెల్లిపూడి, వాకాడు 2 సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాలలో జరుగుతున్న సర్వేలను గురించి ఎంపీడీవో సి.శ్రీనివాసులు సంబందిత సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగింది, మనమిత్ర సర్వేని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో త్వరితగతంగా ప్రజలకి ఎటువంటి సందేహాలు లేకుండా వారికి ఈ మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ గురించి రేపు మధ్యాహ్నం లోపు అవగాహన సర్వేని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించడం జరిగినది. ప్రభుత్వం దేశంలో ఎక్కడా కూడా ఇటువంటి ప్రయోగాత్మక నిర్ణయాలు తీసుకోలేదని, ప్రజలకి ప్రభుత్వ సేవలు మరింత సులభతరంగా మరియు వేగవంతంగా అందించే విధంగా ప్రభుత్వం తీసుకున్న ఈ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ని ప్రజలందరూ వినియోగించుకోవాల్సిందిగా ప్రజలను కోరారు, ప్రభుత్వం ఈ మన మిత్ర కోసం ఏర్పాటుచేసిన వాట్సాప్ నెంబర్ 9552300009 లో ప్రభుత్వం కార్యాలయ సేవలు అన్ని అందుబాటులో ఉంటాయని తెలియజేశారు.

# శ్రీసిటీని సందర్శించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### - గుప్తా ఆక్సిజన్ పరిశ్రమకు భూమిపూజ - పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం
### - శ్రీసిటీ ప్రగతి, మౌళిక సదుపాయాలు, హరిత కార్యక్రమాలపై ప్రశంస



**శ్రీసిటీ/పెన్ పవర్/ఏప్రిల్ 23 :** రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రపంచ శ్రేణి మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతిని వివరించారు. శ్రీసిటీ పరిశ్రమలలో మధ్య, చిన్న తరహా పరిశ్రమల (MSME) శాతం ఎక్కువగా ఉందన్న ఆయన, ఉపాధి కల్పన, ఆవిష్కరణలు, సరఫరా గొలుసుతో పాటు మంచి పర్యావరణ వ్యవస్థ సృష్టికి ఇది దోహదం చేస్తోందన్నారు. ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ విడిభాగాలు, ఇంజనీరింగ్ వస్తువులు, FMCG, ఆహార పదార్థాలతో సహా శ్రీసిటీలో తయారయ్యే విస్తృత శ్రేణి ఉత్పత్తుల ప్రదర్శనను మంత్రి తిలకించారు.

**'గుప్తా ఆక్సిజన్' పరిశ్రమకు శంకుస్థాపన..**

MSME కేటగిరికి చెందిన నూతన పరిశ్రమ గుప్తా ఆక్సిజన్ ప్రైవేట్ లిమిటెడ్ శంకుస్థాపన కార్యక్రమంలో శ్రీసిటీ ఎండీతో కలసి మంత్రి పాల్గొన్నారు. ఆ సంస్థ MD & CEO ఆనంద్ గుప్తా వారికి స్వాగతం పలికారు. శ్రీసిటీ వృద్ధిలో మరో ముందడుగుగా పేర్కొన్న మంత్రి, పరిశ్రమ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను ఈ కంపెనీ మరింత సుసంపన్నం చేస్తుందని డాక్టర్ సన్నారెడ్డి వ్యాఖ్యానించారు.

40 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ పరిశ్రమ 2025 అక్టోబర్ నాటికి ఉత్పత్తులు ప్రారంచించనుంది. 'డ్యూగ్యాస్' పేరిట పారిశ్రామిక గ్యాస్ ను ఇది తయారు చేస్తుంది, ఏసీ, ఆటోమోటివ్ రంగాలకు గ్యాస్ సరఫరా చేస్తుంది. ప్రస్తుతం దీని కస్టమర్ల జాబితాలో గోద్రెజ్, బ్లూస్టార్, వర్ల్‌పూల్ మరియు ఇండియన్ రైల్వేలు ఉన్నాయి. అనంతరం శ్రీసిటీ పరిసరాల్లో మంత్రి పర్యటించారు. ఎవర్టన్ టీ పరిశ్రమను సందర్శించారు. 90 శాతం పైగా స్థానిక గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఈ MSME పరిశ్రమ, మహిళా సాధికారత, సమ్మిళిత వృద్ధికి చక్కని నమూనాగా ఆయన కొనియాడారు.

**ప్రణాళికాబద్ధ అభివృద్ధికి అద్భుత నమూనా 'శ్రీసిటీ'..**

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి శ్రీసిటీ ఒక మంచి నమూనాగా మంత్రి అభివర్ణించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీలో పరిశ్రమల సీఈఓల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ పనితీరును ప్రశంసించారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేసిన డాక్టర్ సన్నారెడ్డిని ఆయన అభినందించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత, నేతృత్వంలో పీ4, విజన్ 2047 లక్ష్యంగా రాష్ట్రం పయనం సాగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో MSMEల వృద్ధి ప్రధాన భాగం అన్నారు. నియోజకవర్గానికి ఒక MSME పార్క్ ఏర్పాటు, ఇంటికో పారిశ్రామికవేత్త తయారీ ముఖ్యమంత్రి విజన్‌లో భాగమన్నారు.

ఈ లక్ష్యంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. నూతన పారిశ్రామిక విధానంలో సమతుల్య వృద్ధి, అంకుర సంస్థలకు మద్దతు, నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. MSME ప్రచారంపై ప్రస్తావిస్తూ, వెండర్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ పారిశ్రామిక రాష్ట్రంగా మార్చడానికి సూచనలను ఆహ్వానించిన మంత్రి, పరిశ్రమల ప్రతినిధులతో పరస్పర చర్చల ద్వారా అభిప్రాయాలను పంచుకున్నారు. వారి పలు ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. గ్రీన్ ఇండస్ట్రియల్ జోన్ హోదా కారణంగా శ్రీసిటీలో కొన్ని పారిశ్రామిక కార్యకలాపాలను నిర్వహించలేకున్నామని, వీటి కోసం శ్రీసిటీకి సమీపంలో ప్రత్యేక MSME పార్కును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కొందరు ప్రతినిధులు మంత్రికి విన్నవించారు. శ్రీసిటీ పర్యటన పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ సన్నారెడ్డి, ఈ తరహా సందర్శనలు రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని మరింత ప్రోత్సహిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎంఈ ఇండియా) ప్రెసిడెంట్ ఏపీకే రెడ్డి, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. MSME కార్పొరేషన్ సీఈఓ విశ్వ మనోహరన్, సత్యవేడు ఎమ్మెల్యే కె.ఆదిమూలం, ప్రిన్సిపల్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఎం.శ్రీనివాస శంకర ప్రసాద్, గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ రాంనాథ్ వెలమాటి, సీనియర్ అధికారులు మంత్రి పర్యటనలో పాల్గొన్నారు.

## ఉగ్రదాడులతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు

### - వైసిపి చిత్తూరు ఇంచార్జ్ విజయానందరెడ్డి




**చిత్తూరు/ పెన్ పవర్/ ఏప్రిల్ 23 :** ఉగ్రదాడులతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని వైసిపి చిత్తూరు ఇంచార్జ్ విజయానందరెడ్డి అన్నారు. భారత్ జోలికెళితే జరిగే పరిమాణామాలను తలచుకొని ఉగ్రవాదులకు వెన్నులో వణుకు పుట్టే విధంగా వారికి భారత్ గట్టిగా బుద్ధిచెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజయానందరెడ్డి కోరారు. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఉగ్రదాడిలో అసువులు భాసిన భారతీయుల ఆత్మ శాంతించాలని, వారి కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ సర్కిల్ వద్ద క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా, భిన్నత్వంలో ఏకత్వంతో, భారతీయులంతా ఒక్కతాటిపైకొచ్చి ఉగ్రవాదాన్ని పారదోలాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## అమాయకుల పై ముష్కరుల దాడి పిరికిపంద చర్య : సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



**సత్యవేడు /పెన్ పవర్/ ఏప్రిల్ 23 :** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్యగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం సాయంత్రం పిచ్చాటూరులో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఉగ్రదాడి తనను తీవ్రంగా కలచి వేసిందని, దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్ లో మళ్ళీ అలజడిని సృష్టించి, తద్వారా దేశ సమైక్యతను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే తీవ్రవాదులు ఈ పాపానికి ఒడిగట్టారన్నారు. ముష్కరుల ఈ కిరాతక దాడికి ధీటుగా బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు. కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా ఇటువంటి దాడులను ఖండిస్తూ అందరూ సమిష్టిగా పోరాడవలసిన సమయం ఆసన్నమైందన్నారు. బాధిత కుటుంబాలను అన్నీ విధాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఎమ్మెల్యే సూచించారు. ఈ దాడిలో మృతి చెందిన కుటుంబాలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అలాగే గాయపడ్డ బాదితులు త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## జమ్మూ కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రదాడి... నిరసన









**అనంతపురం పెన్ పవర్ ఏప్రిల్ 23 :** జమ్ము కాశ్మీర్‌లోని బైసారన్ దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు తెగబడి 28 మందిని కాల్చివేయడాన్ని ఖండిస్తూ జనసేన పార్టీ మూడు రోజులపాటు సంతాప దినాలు పాటిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం అనంతపురం జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పతాకాన్ని అవనతం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా జనసేన ఉపాధ్యక్షులు లాయర్ కుంటిమద్ది జయరామిరెడ్డి, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా కార్యదర్శిలు సంజీవ రాయుడు, కిరణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శిలు జయమ్మ, అవుకు విజయకుమార్, నగర ఉపాధ్యక్షుడు జక్కి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శిలు మేదర వెంకటేష్, హిమామ్ హుస్సేన్, నగర కార్యదర్శులు విశ్వనాథ్, కుమ్మర మురళి, సంపత్ నగర సహాయ కార్యదర్శి మంగళ కృష్ణ, కార్యక్రమాల కమిటీ సభ్యుడు సంతోష్, వీరమహిళ మంజుల నాయకులు ప్రసాద్, హరి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## పహాల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి సంతాపం




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి ఏప్రిల్ 23 :** నిన్నటి రోజున కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదులు దాడిలో మరణించిన వారికి ఈ రోజు జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కొవ్వొత్తులతో సంతాపం తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా కొట్టే సాయి మాట్లాడుతూ "కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని జనసేనపార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తీవ్రంగా ఖండించారు అని,ఈ దాడిలో మరణించిన వారికి సంతాపంగా మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించారు అని,అందులో భాగంగా ఈ రోజు శ్రీకాళహస్తిలో కొవ్వొత్తులతో మరణించిన వారికి సంతాపం తెలియజేయడం జరిగింది అన్నారు. ఈ దాడిని పిరికి పందల చర్యగా అభివర్ణించారు, నిరాయుదులు అయిన పర్యాటకులను చుట్టుముట్టి కాల్పులు జరపడం సిగ్గుచేటు అని, ఈ పాకిస్తాన్ ప్రేరేపిత ఇస్లాం ఉగ్రవాదుల చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు దండి రాఘవయ్య, నాయకులు కుమార్,గరికపాటి చంద్ర,ఈర్ల చిరంజీవి, భాస్కర్, కాపునాడు నాయకులు పగడాల ప్రతాప్, రాఘవ, ఢిల్లీ బాబు,జానీ బాషా,హుస్సేన్, ఉస్మాన్, యూసఫ్, సురేష్ బాబు, రఘు, బాబీ పాల్గొన్నారు.

## ఆక్స్ఫర్డ్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా 8వ వార్షికోత్సవం




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి ఏప్రిల్ 23 :** ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథి శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి, శ్రీకాళహస్తి ఎం ఈ ఓ లు భువనేశ్వరి, బాలయ్య, పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్ రెడ్డి.... మొదలైన వాళ్ళు పాల్గొన్నారు. ఈ సంవత్సరము ఎస్ఎస్సి లో అధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు అతిథులు చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు.

# మండల అభివృద్ధికి సమిష్టిగా పనిచేద్దాం

### - వరదయ్యపాలెం మండల మీట్ లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
### - శ్రీసిటీలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే ఘన స్వాగతం






**వరదయ్యపాలెం/పెన్ పవర్/ ఏప్రిల్ 23 :** మండల అభివృద్ధికి సమిష్టి గా కృషి చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం వరదయ్యపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలోని సభ్యులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో కొత్త రేషన్ కార్డులు, కొత్త ఫించన్ లు మంజూరు చేయనుందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి రేషన్ కార్డు, ఫించను మంజూరయ్యేలా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా స్మశానాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, స్మశానం సమస్య ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం శాఖల వారీగా అధికారులు తమ ప్రగతి నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటిసి సభ్యులు, ఎంపీడీఓ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు ఎమ్మెల్యే ఘన స్వాగతం బుధవారం శ్రీ సిటీని సందర్శించడానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి ఎమ్మెల్యే పుష్పగుచ్చం అందించి, శాలువా కప్పి, గజ మాలతో ఘనంగా ఆహ్వానం పలికారు. కొండపల్లి శ్రీనివాస్ 43 ఏళ్లకే చంద్రన్న ప్రభుత్వం లో మంత్రిగా పనిచేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను పాల్గొన్నారు.

# జోరుగా బెట్టింగ్...

**విజయవాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ భూతం ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసింది. ఎంతోమంది యువత ఆయుష్షును అర్థాంతరంగా ముగిసేలా చేసింది. ఇక ఏపీలోని చాలా బార్లలో రోజూ బెట్టింగ్ నడుస్తుంది. ప్రతీదగ్గర స్క్రీన్‌లు వేసి బెట్టింగ్‌లు జోరుగా నడిపిస్తున్నారు. దీంట్లో ప్రజా ప్రతినిధులకు కూడా వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే వాళ్లవే బార్లు, వాళ్లవే బెట్టింగులు అని తెలుస్తోంది. ఉదాహరణకు ఏలూరులో రైల్వే స్టేషన్ సమీపంలో ఓ బార్ ఉంది. ఓపెన్ ఎయిర్ స్క్రీన్ ఏర్పాటు చేసి.. జోరుగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిపైనా కేసులు నమోదు చేసింది. ఫలితంగా ఆన్ లైన్ బెట్టింగ్ కాస్త తగ్గింది. కానీ.. ఇన్నాళ్లు బెట్టింగ్ దోపిడీకి పాల్పడ్డ ముఠాలు ఇప్పుడు కొత్త దారిని ఎంచుకున్నాయి.ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆన్ లైన్ బెట్టింగ్‌పై గట్టి నిఘా ఉంది. దీంతో బుకీలు రూచ్ మార్చి.. మళ్లీ పాత పద్ధతిని ఎంచుకున్నారు. ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఏపీ–తెలంగాణ సరిహద్దు పట్టణాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వరావుపేట, మధిర, కొత్తగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, వైరా ప్రాంతాల్లో గుట్టుగా బుకీలు దందా సాగిస్తున్నారు.ఇటు నల్గొండ జిల్లాలోని హుజూర్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా జోరుగా సాగుతోందని తెలుస్తోంది. ఈ ప్రాంతాలకు అటు ఏపీ నుంచి ఇటు తెలంగాణ నుంచి బెట్టింగ్ రాయుళ్లు వస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా బార్లు, చాయ్ కేఫ్‌లు, రెస్టారెంట్లు,



లాడ్జీలు ఆఫ్ లైన్ బెట్టింగ్‌కు వేదికలయ్యాయి. చాలా రోజులుగా పోలీసులు ఈ ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పై ఫోకస్ పెట్టడం లేదు. దీంతో బుకీలు రెచ్చిపోతున్నారు.ఆఫ్ లైన్ బెట్టింగ్ స్పాట్‌కు తక్కువ మంది వెళ్తున్నారు. అక్కడ ఉన్న బుకీలు, బ్రోకర్లు అమాయకులకు ఫోన్లు చేసి బెట్టింగ్ పెట్టేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఈ విష సంస్కృతి మారుమూల పల్లెలకూ పాకింది. నెలకు రూ.10 వేలు సంపాదించే వారు కూడా క్రికెట్ బెట్టింగ్‌కు బానిసలవుతున్నారు. బాల్ టు బాల్, ఓవర్ టు ఓవర్, వికెట్ టు వికెట్.. ఇలా రకరకాలుగా బెట్టింగ్ నడుస్తోంది. ఇప్పటికే ఎంతోమంది డబ్బులు పోగొట్టుకొని చెప్పలేని తిప్పలు పడుతున్నారు.ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లో మోసపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అనధికారిక వ్యక్తులు లేదా సంస్థలు బెట్టింగ్ నిర్వహిస్తే, మీ డబ్బును కోల్పోయే ప్రమాదం ఉంది. గెలిచినప్పటికీ, వారు చెల్లించకపోవచ్చు. ఆఫ్‌లైన్‌లో ఎంత మొత్తం బెట్ వేస్తున్నారో ట్రాక్ చేయడం కష్టం. ఇది ఎక్కువ నష్టపోయేలా చేస్తుంది. బెట్టింగ్ వ్యసనంగా మారితే.. అది వ్యక్తిగత, కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆఫ్‌లైన్‌లో ఈ వ్యసనం మరింత వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

# అనంత వైసీపీలో వర్గపోరు



**అనంతపురం, ఏప్రిల్ 23, పెన్ పవర్:** అనంతపురం ఉమ్మడి జిల్లాలో పెనుగొండ తెలుగుదేశం పార్టీకి అత్యంత పట్టున్న నియోజకవర్గం. అలాంటి చోట 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయం లోనే పెనుకొండ లో కూడా మొట్టమొదటి సారి వైసిపి బోణీ కొట్టింది. దీంతో సరాసరి పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయనకీ సైతం జగన్ రెడ్డి మంత్రి పదవి కూడా కట్టబెట్టారు. ఇక్కడి వరకు అంతా సవ్యంగానే జరిగింది. తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచిందన్న చందంగా జగన్ రెడ్డి చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. అనంతరం 2024 ఎన్నికల్లో శంకర్ నారాయణ కాదని అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్‌నుకు చాన్స్ ఇచ్చారు. పెనుగొండ నియోజకవర్గం బీసీకి ( కురుబ ) కంచుకోట అలాంటి నియోజకవర్గంలో ఎప్పుడు తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తూ వచ్చింది. వైయస్ ఆర్ పార్టీ ఆవిర్భావం నుంచి కూడా జగన్మోహన్ రెడ్డికి వెన్నంటే ఉంటూ వస్తున్న కృప శంకర్ నారాయణ కు 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి జగన్ బరిలో నిలిపాడు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బి కే పార్థసారథి పై శంకర్ నారాయణ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అనంతరం శంకర్ నారాయణ కు జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవిని కూడా కేటాయించారు. 2024 ఎన్నికల్లో శంకర్ నారాయణ ను అనంతపురం పార్లమెంటు అభ్యర్థిగా బరిలోకి దింపి అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్ ను పెనుగొండ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. కానీ ఆమె పరాజయం పాలయ్యారు. 2024 ఎన్నికల ఓటమి అనంతరం వైయస్సార్సీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. బలమైన అభ్యర్థి శంకర్ నారాయణ కాదని ఉషాశ్రీ చరణ్ కు టికెట్ కేటాయించినప్పటి నుంచి కూడా పెనుగొండ నియోజకవర్గం లో వర్గ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గ ఇన్చార్జిను మార్చాలన్న ప్రతిపాదన జగన్ వరకు వెళ్లినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఉషశ్రీ చరణ్ శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షురాలుగా కూడా కొనసాగుతున్నారు. పెనుగొండ నుంచి పరిటాల రవీంద్ర మూడు సార్లు వరుసగా విజయం సాధించారు. ఆయన హత్య తర్వాత రవి భార్య పరిటాల సునీత ఒక్కసారి పెనుగొండ నుంచి గెలుపొందారు. మొత్తంగా ఇప్పటివరకు 8 సార్లు పెనుగొండ నుంచి టీడిపి విజయం సాధించింది. ఉషాశ్రీచరణ్‌ను పెనుగొండకు మార్చిన జగన్ 2019 ఎన్నికల్లో మాజీ మంత్రి శంకర నారాయణ వైసీపీ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత పరిణామాలు మారిపోయాయి. అనంతపురం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన శంకరనారాయణ.. తిరిగి పెనుకొండ నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ పదవి ఆశిస్తూ పావులు కదుపుతున్నార%స్త%. మండల స్థాయిలో తన వర్గీయులతో సమావేశాలు పెట్టి మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారంట. పార్టీ అధ్యక్షుడు జగన్, ఇతర పార్టీ పెద్దల వద్దకు వెళ్లి నియోకవర్గ ఇన్చార్జ్ పదవి శంకర్ నారాయణకే ఇవ్వాలని పెనుగొండ సెగ్మెంట్ పరిధిలోని మండలాల నేతలు వత్తిడి తెస్తున్నారు. ఉష శ్రీ చరణ్ హైకమాండ్ దగ్గర తన పలుకుబడిని ఉపయోగించి పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ శంకరనారాయణ వర్గీయుల్ని కొందర్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. దాంతో పెనుగొండలో వారద్దరి మధ్య పరిస్థితి ఉప్పునిప్పులా తయారైందంటున్నారు . ఎప్పుడో వచ్చే ఎన్నికల కోసం వారిద్దరు అలా కుస్తీ పడుతుంటే.. ఇటీవల వారిద్దరికి పోటీగా మూడో వ్యక్తి సీన్లోకి వచ్చి ఇన్చార్జ్ పదవి కోసం పోటీ పడుతున్నారంట. ఉషాశ్రీ, శంకరనారాయణలను పెనుగొండ వైసీపీలో సైడ్ చేయడానికి శిల్పా అనే కొత్త నాయకురాలు ప్రయత్నిస్తున్నారనీ టాక్ నడుస్తోంది. ఇప్పటికే పెనుగొండ లో ఇద్దరు మాజీ మంత్రులు శంకర్ నారాయణ , ఉష శ్రీ చరణ్ లు రెండు వర్గాలుగా వైసీపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఇన్చార్జ్‌గా ఉష శ్రీ చరణ్ ఏమాత్రం ప్రభావం చూపించలేకపోతున్నారని పార్టీ క్యాడర్ ఆరోపణలు గుప్పిస్తోంది.. ఈ క్రమంలో పెనుగొండ నియోజకవర్గం వైసీపీలో వర్గ విభేదాలను పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా పరిష్కారం చూపుతాడో వేచి చూడాల్సి ఉంది.

# తెరపైకి బల్లం సుధీర్ పేరు

**కడప, ఏప్రిల్ 23, పెన్ పవర్:** వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరఫున అన్నీ తానై వ్యవహరించిన కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కెసిరెడ్డి ఎట్టకేలకు అరెస్టయ్యారు.రాజ్ కెసిరెడ్డి రాజేష్‌రెడ్డి అనే మారు పేరు, నకిలీ గుర్తింపు పత్రాలతో గోవా నుంచి ఇండిగో విమానంలో హైదరాబాద్‌లో దిగారు. విమానాశ్రయంలో అప్పటికే మాటు వేసిన సిట్ అధికారులు పట్టుకున్నారు. అరెస్టు చేసినట్లు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. శంషాబాద్ నుంచి రాత్రి 11.10 గంటలకు ఆయన్ను విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉన్న సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు కాగా రాజ్ కెసిరెడ్డి.సిట్ జారీ చేసిన నోటీసుల చట్టబద్ధతను సవాల్ చేస్తూ, ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టు, సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటి విచారణలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు ఆయనపై లుకౌట్ సర్క్యులర్ జారీ అయింది. మరోవైపు రాజ్ కెసిరెడ్డి విచారణకు ఏ మాత్రం సహకరించకపోవటంతో.. ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, బినామీలు, మద్యం కుంభకోణం సొత్తును పెట్టుబడులుగా పెట్టిన సంస్థలు, వాటి డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో సిట్ అధికారులు ఇటీవల వరుసగా

3 రోజులపాటు సోదాలు నిర్వహించారు. కీలక పత్రాల్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయన తండ్రి ఉపేంద్రరెడ్డికి నోటీసులిచ్చారు. ఇలా అన్ని వైపుల నుంచి అష్టదిగ్బంధం చేయడంతో తప్పించుకోవటం సాధ్యం కాదని గుర్తించిన రాజ్ కెసిరెడ్డి.. హైదరాబాద్ నుంచి చెన్నైకు చేరుకుని అక్కడి నుంచి విదేశాలకు వెళ్లిపోవాలని కుట్ర చేశారు. కానీ ఈ లోపు సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.కాగా కసిరెడ్డి విచారణ సందర్భంగా పలువురి పేర్లు బయటకు వచ్చినట్లు తెలుస్తుంది. నిన్న రాత్రి నుంచి కసిరెడ్డిని సిట్‌చీఫ్ రాజశేఖర్ బాబు విచారిస్తున్నారు. ఈవిచారణలో సిట్ చీఫ్‌తో పాటు ఏడుగురు అధికారుల బృందం ఉంది. అయితే వసూళ్ల నెట్‌వర్క్‌తో తనకు సంబంధం లేదని కసిరెడ్డి చెబుతున్నట్లు సమాచారం. గతంలో విజయసాయి, మిథున్ సిట్‌ఎదుట ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా విచారణ జరుగుతోంది. పలు ఆధారాలను చూపిస్తూ సిట్ బృందం ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో తెరపైకి బల్లం సుధీర్ అనే పేరు వచ్చింది. ఇతను కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుంది. లావాదేవీలన్నీ సుధీర్ ద్వారానే జరిపినట్టు తెలుస్తుంది. ఇంతకు సుధీర్ ఎవరు అనే కోణంలో అధికారులు కూపీ లాగే పనిలో ఉన్నారు. ఏపీ, తెలంగాణలో ఇసుక మాఫియాలోనూ ఇద్దరూ ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. కసిరెడ్డి, సుధీర్ కలిసి వందల కోట్ల రూపాయలు వెనుకేసుకొన్నట్లు సమాచారం. ఈ లిక్కర్ స్కాంలో కేసిరెడ్డి తర్వాత సుధీర్దే కీలకపాత్రఅని అంటున్నారు. సుధీర్ అరెస్ట్ అయితే మరిన్ని సంచలనలు బయటకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## కేశినేని బ్రదర్స్ మధ్య వార్



**విజయవాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** బెజవాడ రాజకీయాలు మళ్లీ హీటెక్కాయి. కేశినేని నాని, కేశినేని చిన్నిల మధ్య మళ్లీ ట్వీట్ల యుద్ధం మొదలయింది. విశాఖపట్నంలో ఉర్సా క్లస్టర్ కంపెనీకి భూములను కేటాయించడంపై కేశినేని అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు నాయుడును ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ఉర్సా క్లస్టర్ కంపెనీకి ఒక విశ్వసనీయత లేదని, 2025లో స్థాపించిన సంస్థ కావడంతో దానికి అతి తక్కువ ధరకు భూములను కేటాయించడంపై కేశినేని నాని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు. ఈ సంస్థకు ఇచ్చిన భూముల కేటాయింపులను రద్దు చేయాలని కూడా కేశినేని నాని కోరారు. దీనిపై అనేక విమర్శలు కూడా వెల్లువెత్తుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు... విశాఖపట్నంలో అతి తక్కువ ధరకు ఉర్సా క్లస్టర్ కంపెనీకి అరవై ఎకరాలు కేటాయించడం ఇప్పటికే విమర్శలకు తావిచ్చింది. ఊరూ పేరులేని సంస్థకు అంత విలువైన భూములను ఎలా అప్పగిస్తారని జాతీయ మీడియాలో సయితం కథనాలు ప్రసారమయ్యాయి. 2025లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత స్థాపించిన పరిశ్రమకు అంత పెద్ద సంఖ్యలో భూముల ఎలా కేటాయిస్తారన్న ప్రశ్నలు బాగా వినపడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కేశినేని నాని ఆయనకు బర్త్ డే విషెస్ చెప్పారు. 2024లో తనకు సీటు దక్కకపోవడంతో కేశినేని నాని టీడీపీని వీడి వైసీపీలో చేరారు. వైసీపీ నుంచి పోటీ చేసినా విజయవాడ పార్లమెంటు ప్రజలు మూడో సారి ఆదరించలేదు దీంతో మళ్లీ కేశినేని నాని చంద్రబాబుకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరగుతుంది. ఈ నేపథ్యలోనే ఆయన బర్త్ డే కి నిన్న ట్వీట్ చేసి నేడు మరో ట్వీట్ తో ఆయన సోదరుడు ప్రస్తుత ఎంపీ కేశినేని చిన్ని పితూరీలు చెప్పేందుకు సిద్ధమయ్యారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. కేశినేని నాని, కేశినేని చిన్నిలు అన్నదమ్ములయినప్పటికీ ఇద్దరి మధ్య ఆస్తుల వివాదాలతో పాటు రాజకీయ వైరుధ్యాలు ఉండటంతోనే ఈ ట్వీట్ వార్ స్టార్ట్ చేశారంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఆరోపించారు. ఉర్సా క్లస్టర్ సంస్థ కేశినేని చిన్నికి చెందిందని, దానికి అంత పెద్ద సంఖ్యలో భూములు కేటాయించడాన్ని కేశినాని నాని తప్పు పట్టడం ఇప్పుడు బెజవాడ పాలిటిక్స్ లో హీట్ ను రాజేసినట్లయింది. కేశినేని చిన్నికి సంబంధించిన సంస్థ కాబట్టే తక్కువ ధరకు అరవై ఎకరాల విలువైన భూములను కేటాయించారన్న అర్థం వచ్చే రీతిలో కేశినేని నాని ట్వీట్ చేయడం టీడీపీ నేతల ఆగ్రహానికి గురి చేసింది. అయితే దీనిపై బుద్ధా వెంకన్న మినహా ఎవరూ స్పందించకపోయినా కేశినేని నాని మరోసారి తన సోదరుడు చిన్నిని లక్ష్యంగా చేసుకుని ఈ ట్వీట్ చేశారంటూ పెద్దయెత్తున సోషల్ మీడియాలో టీడీపీ నేతలు ధ్వజమెత్తుతున్నారు. నారా లోకేశ్ పేరును కూడా కేశినేని చిన్ని మద్యం, ఇసుక వంటి కేసుల్లో బయటకు తెస్తున్నారని కూడా కేశినేని నాని ట్వీట్ చేయడం ఇప్పుడు తెలుగుదేశం పార్టీలోనే కాదు.. కూటమి పార్టీల్లోనూ చర్చనీయాంశమైంది. మరోసారి బ్రదర్స్ మధ్య వార్ మళ్లీ మొదలయినట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు

## తియ్యని పండ్ల వెనుక చేదు నిజాలు...

**విజయవాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** నూజివీడు.. మామిడి పండ్లకు కేరాఫ్ అడ్రస్. నూజివీడు ప్రాంతంలో దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఇక్కడ కాయలు కోయకముందే వ్యాపారులు రైతులతో ఒప్పందం చేసుకొని తోటలను కొనుగోలు చేస్తారు. ఆ పంట వరకు డబ్బులు చెల్లించి.. కోత మొదలు పెడతారు. దీంతో రైతులకు పండ్లతో సంబంధం ఉండదు. కేవలం పండించడమే వారి బాధ్యత.ఇదంతా ఎలా ఉన్నా.. అసలు సమస్య అక్కడే మొదలవుతోంది. వ్యాపారులకు విక్రయించని రైతులు.. పండ్ల పండాక కోసి.. మార్కెట్లకు తరలిస్తారు. కానీ.. వ్యాపారులు కొనుగోలు చేసిన తోటల్లో.. పండ్లు పూర్తిగా పండకముందే.. కోస్తున్నారు. వాటికి రసాయనాలు పూసి.. తొందరగా పక్వానికి వచ్చేలా చేస్తున్నారు. ఇలా చేయడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వాటిని ఇతర పట్టణాలు, నగరాలకు తరలించి విక్రయిస్తున్నారు.రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యలు బారినపడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పండ్లను తీసుకోవడం ద్వారా.. క్యాన్సర్, అల్సర్, లివర్, కిడ్నీ, జీర్ణ సంబంధిత వ్యాధులు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, నరాల బలహీనతలకు గురయ్యే ప్రమాదం ఉంది. కాల్షియం కార్బైడ్ ద్వారా వెలువడే ఎసిటిలిన్ వాయువు.. నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపి తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు, శక్తిని కోల్పోయే ప్రమాదముంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయి.2011 ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు ప్రకారం.. ప్రభుత్వం కార్బైడ్, ఎసిటిలిన్ రసాయనాలను నిషేధించింది. సహజంగా పండించే ఇథిలిన్‌ను మాత్రమే కొంత వరకు వినియోగించేందుకు అనుమతిచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. సుమారు 20 కిలోల పండ్లకు 5 గ్రాముల ఇథిలిన్‌ను వినియోగించాల్సి ఉంటుంది. మేలిమి పండులా కనిపించేందుకు వ్యాపారులు కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. ఆమోదించిన ఇథిలిన్‌తో పోలిస్తే కార్బైడ్, ఇతర రసాయనాలు మార్కెట్‌లో చౌకగా లభిస్తుండటంతో వీటిని వ్యాపారులు ఇష్టానుసారంగా వాడుతున్నారు.'కృత్రిమంగా పండించిన పండ్లను తిన్న వారికి వాంతులు, విరేచనాలు, దాహం ఎక్కువగా కావటం, కడుపులో తిప్పటం వంటి సమస్యలు వస్తాయి. మామిడి పండ్లను తినే ముందు ఉప్పు నీటిలో కడగాలి. కృత్రిమంగా పండించిన పండ్లను సాధ్యమైనంత వరకు తినకపోవడం మంచిది' అని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## జగన్ యూ.. టర్న్ తప్పదా...

**ఒంగోలు, ఏప్రిల్ 23, పెన్ పవర్:** మూడు రాజధానుల నుంచి మద్యం వరకు.. వలంటీర్ వ్యవస్థ నుంచి సచివాలయాల వరకు.. వైసీపీ అధినేత జగన్ చేసిన ప్రయోగాలు వికటించిన విషయం తెలిసిందే. ఇవే.. ఆయనను నిలువునా ముంచాయన్నది మేధావుల నుంచి విశ్లేషకుల వరకు చెబుతున్న మాట. తాను పట్టిన కుందేలుకు మూడు కాళ్లే అన్నట్టుగా ఆయన అప్పట్లో వ్యవహరించారన్న విమర్శలు తెలిసిందే. ఏరాష్ట్రంలోనూ లేని విధంగా మూడురాజధానులు తెచ్చారు. దీనిపైకేంద్రం కూడా విస్మయం వ్యక్తం చేసింది.ఇక, వలంటీర్ వ్యవస్థను తెచ్చామని చెప్పినా.. వారిని పొడిగించని ఫలితంగా ఇప్పుడు వారికి దిక్కు మొక్కు లేకుండా పోయింది. పైగా ఎన్నికల సమయంలో కీలక నాయకుల కంటే కూడా.. వారే ఎక్కువై పోయారన్నట్టుగా జగన్ వ్యవహరించారు. ఫలితంగా కార్యకర్తలు పోయి..వైసీపీని వలంటీర్లు నడిపించే పరిస్థితి వచ్చింది. ఇదో పెద్ద మైనస్‌గామారి.. ఎక్కడికక్కడ ఓటు బ్యాంకు చీలిపోయింది. ఫలితంగా వైసీపీ నాశనమైంది.ఇక, మరో రెండు కీలక విషయాలు.. మద్య నిషేధం.. చీప్ బ్రాండ్స్‌ను ఎక్కువ ధరలకు విక్రయించడం.. ఈ రెండు కూడా.. వికటించాయి. మద్యనిషేధం పేరుతో మంచి చేశామని జగన్ చెబుతున్నా.. ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. ఇక, సచివాలయాలను నిర్మించి.. మంచి చేసినా.. దానివల్ల కూడా ప్రయోజనం రాబట్టుకోలేక పోయారు. సో.. మొత్తంగా జగన్ అనుసరించిన విధానాలు వివాదానికి దారితీశాయి. చివరకు ఆ పార్టీకి మైనస్ పై మైనస్ అయ్యాయి.ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి.. జగన్ తన విధానాలను మార్చుకోక తప్పదన్న వాదన బలంగా వినిపిస్తోంది. "ఏం చేస్తారో.. ఏమో.. మా విధానాలు మారాల్సి ఉంది. ఏదీ ఒక్కటీ కూడా వర్కవుట్ కాలేదు. మా నాయకుడు ఆదిశగా అడుగులు వేస్తారని అనుకుంటున్నాం. ఇంకా మూడు రాజధానులని మేం ఎలా చెబుతాం" అని సీనియర్ నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వ్యాఖ్యలు పరిగణనలోకి తీసుకుంటే.. మార్పు తప్పదన్న సంకేతాలు వస్తున్నాయి. సో.. జగన్‌తన విధానాలను మార్చుకునే టైం త్వరలోనే ఉందని కూడా అంటున్నారు. మరి ఏంచేస్తారు..? కొత్త విధానాలు ఏంటి? అనేది వేచి చూడాలి.

## పాక్ పేసర్ అత్యుత్సాహం.. తలకేసి బాదడంతో ఉస్మాన్ ఖాన్‌కు తీవ్ర గాయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ క్రికెట్ లో ఎక్కడా జరగని ఊహించని సంఘటనలు పాక్ క్రికెట్ లో జరుగుతాయి. వీరు చేసే వింత పనులకి ఆశ్చర్యం కలగక మానదు. తాజాగా అలాంటి సంఘటన ఒకటి పాకిస్థాన్ సూపర్ లీగ్ లో చోటు చేసుకుంది. పీఎస్ఎల్ లో భాగంగా మంగళవారం(ఏప్రిల్ 22) ముల్తాన్ సుల్తాన్స్, లాహోర్ ఖలందర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో

జరిగిన వింత సంఘటన ఒకటి వైరల్ గా మారుతుంది. ఫాస్ట్ బౌలర్ ఉబైద్ షా అత్యుత్సాహం కారణంగా తమ జట్టు ఉస్మాన్ ఖాన్ గాయాలపాలయ్యాడు. 229 పరుగుల లక్ష్య ఛేదనలో లాహోర్ ఖలందర్స్ విజయం కోసం పోరాడుతోంది. ఇన్నింగ్స్ 15 ఓవర్ చివరి బంతికి ఉబైద్ షా ఒక స్లో బాల్ తో బిల్లింగ్స్ ను ఔట్ చేశాడు. మ్యాచ్ లో ఈ వికెట్ కీలకం కావడంతో ఉబైద్ షా ఆనందానికి అవధులు లేకుండా పోయింది. సంతోషంతో సెలెబ్రేషన్ ఓ రేంజ్ లో చేసుకున్నాడు. ఈ క్రమంలో నియంత్రణను కోల్పోయాడు. సహచర వికెట్ కీపర్ ఉస్మాన్ ఖాన్ కు హైఫై ఇచ్చే ప్రయత్నంలో అతని తలకేసి గట్టిగా బాదాడు. అత్యుత్సాహంలో ఉబైద్ షా తన అరా చేతితో ఉస్మాన్ తలను గట్టిగా కొట్టడంతో నొప్పితో అక్కడే పడిపోయాడు. హెల్మెట్ లేకుండా ఉండడంతో ఒక్కసారిగా ముల్తాన్ శిబిరంలో ఆందోళన కలిగింది. వెంటనే వైద్య శిబిరం వచ్చి అతనికి చికిత్స ఇవ్వడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ మ్యాచ్ లో ఉబైద్ షా 4 ఓవర్లలో 33 పరుగులు చేసి మ్యాచ్ ను మలుపు తిప్పాడు. మరోవైపు బిల్లింగ్స్ 23 బంతుల్లోనే 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 43 పరుగులు చేసి ముల్తాన్ ను వణికించాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే ముల్తాన్‌లో సుల్తాన్స్ 33 పరుగుల తేడాతో లాహోర్ ఖలందర్స్ పై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముల్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో లాహోర్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 195 పరుగులు మాత్రమే చేయగలిగింది.

## వార్నర్, గిల్ క్రిస్ట్ కాదు.. ఐపీఎల్ చరిత్రలో అతడే బెస్ట్ ఆస్ట్రేలియన్ ప్లేయర్: ఆరోన్ ఫించ్




ఐపీఎల్ చరిత్రలో ఆస్ట్రేలియా క్రికెటర్లు చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. 2008లో ప్రారంభమైన ఈ మెగా లీగ్ లో ఆసీస్ క్రికెటర్ల హవా ప్రతి సీజన్ లో నడుస్తూనే ఉంటుంది. మాథ్యూ హేడెన్, మైఖేల్ హస్సీ,ఆడమ్ గిల్ క్రిస్ట్, రికీ పాంటింగ్,షేన్ వాట్సన్, గ్లెన్ మెగ్రాత్ లాంటి దిగ్గజ క్రికెటర్లు తమ ప్రభావాన్ని చూపగా.. ఆ తర్వాత స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, డేవిడ్ వార్నర్ తమ జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీ క్రికెట్ లో వన్ ఆఫ్ ది బెస్ట్ ప్లేయర్ గా రికార్డ్ ఉన్న ఆరోన్ ఫించ్.. ఐపీఎల్ లో మాత్రం రాణించలేకపోయాడు.

ఈ మాజీ ఆస్ట్రేలియా కెప్టెన్ చాలా ఫ్రాంచైజీలకు ఆడినా అంచనాలు అందుకోలేకపోయారు. అయితే ఈ మెగా లీగ్ లో తన ఫేవరేట్ క్రికెటర్ ఎవరో చెప్పాడు. ఈఎస్పియన్ క్రిక్ ఇన్ఫో తో ఇటీవల జరిగిన సంభాషణలో ఆస్ట్రేలియా వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ మాట్లాడాడు. ఇందులో భాగంగా ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ ఆస్ట్రేలియన్ ఆటగాడిని ఎంచుకోవాలని ఆరోన్ ఫించ్ ను అడిగారు. ఆప్షన్స్ కూడా ఇస్తూ మైఖేల్ హస్సీ, గ్లెన్ మాక్స్వెల్, ఆడమ్ గిల్ క్రిస్ట్, మాథ్యూ హేడెన్, రికీ పాంటింగ్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, డేవిడ్ వార్నర్ పేర్లను ఈ ఆసీస్ క్రికెటర్ ముందు ఉంచారు. ఈ లిస్ట్ చూసిన తర్వాత ఫించ్ వీరందరినీ వదిలేసి ఆల్ రౌండర్ షేన్ వాట్సన్ ను లీగ్ లో అత్యుత్తమ ఆస్ట్రేలియన్ ప్లేయర్ గా ఎంచుకోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. వార్నర్, గిల్ క్రిస్ట్ గతంలో హైదరాబాద్ జట్లకు టైటిల్స్ అందించారు. వీరిద్దరినీ కాదని వాట్సన్ ను సెలక్ట్ చేసుకున్నాడు. వాట్సన్ తొలి సీజన్ నుంచి అద్భుతంగా ఆడుతున్నాడు. ప్రారంభంలో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన ఈ ఆసీస్ ఆల్ రౌండర్ తొలి సీజన్ లోనే రాజస్థాన్ టైటిల్ గెలవడంతో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత చెన్నై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో పెద్దగా రాణించకపోయినా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరపున అదరగొట్టాడు.

# సొంతగడ్డపై బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్.. నాలుగేళ్ల తర్వాత జింబాబ్వేకు టెస్ట్ విజయం



టెస్ట్ క్రికెట్ లో జింబాబ్వే చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. సిల్హెట్ వేదికగా బంగ్లాదేశ్ పై జరిగిన మ్యాచ్ లో మూడు వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. బుధవారం (ఏప్రిల్ 23) 174 పరుగుల లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసి బంగ్లాదేశ్ కు షాక్ ఇచ్చింది. బంగ్లాదేశ్ వెళ్లిన జింబాబ్వే ఈ సంచలన విజయాన్ని నమోదు చేయడం విశేషం. నాలుగేళ్ల తర్వాత జింబాబ్వే టెస్టుల్లో విజయం సాధించడంతో వారి సెలెబ్రేషన్స్ ఓ రేంజ్ లో సాగాయి. చివరిసారిగా మార్చి 2021లో ఆఫ్ఘనిస్తాన్‌పై జింబాబ్వే టెస్ట్ గెలిచింది. 174 పరుగుల లక్ష్య ఛేదనలో జింబాబ్వేకు అదిరిపోయే ఆరంభం లభించింది. తొలి వికెట్ కు ఓపెనర్లు బెన్ కరన్ (44), బెన్నెట్ (54) 95 పరుగులు జోడించి విజయాన్ని ఖాయం చేశారు. అయితే ఈ దశలో బంగ్లాదేశ్ బౌలర్లు చెలరేగారు. ఒక్కసారిగా విజృంభించి వికెట్లు తీస్తాడం స్టార్ట్ చేశారు. 50 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు తీసి జింబాబ్వేను ఒత్తిడిలో పడేశారు. చివర్లో వెస్లీ మాధేవేరే(19లి) జాగ్రత్తగా ఆడుతూ సంచలన విజయాన్ని అందించాడు. రెండు ఇన్నింగ్స్ ల్లో 9 వికెట్లు పడగొట్టిన బ్లెస్సింగ్ ముజారబానీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. బంగ్లా మూడో రోజు 4 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసిన బంగ్లాదేశ్ 255 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ నజ్ముల్ శాంటో (60 బ్యాటింగ్) ఓవర్ నైట్ స్కోర్ వద్ద ఔటయ్యాడు. ముజారబానీ 6 వికెట్లు తీసుకోగా.. చివర్లో లోయర్ ఆర్డర్ ను వెల్లింగ్టన్ మసకడ్జా పెవిలియన్ కు పంపాడు. అంతక ముందు జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 273 రన్స్ వద్ద ఆలౌటైంది. ఫలితంగా మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టుకు 82 రన్స్ ఆధిక్యం లభించింది. సీన్ విలియమ్స్ (59), బ్రియాన్ బెనెట్ (57) హాఫ్ సెంచరీలతో రాణించారు. బంగ్లాదేశ్ తమ తొలి ఇన్నింగ్స్ లో 191 రన్స్‌కే ఆలౌటైంది. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్ లో జింబాబ్వే 1-0 ఆధిక్యంలో నిలిచింది.

**మీనాక్షి చౌదరి యొక్క లేటెస్ట్ లుక్స్ డ్రీమ్ క్లోసెట్ నుండి సూటిగా ఉన్నాయి**



# బలగం భామ వాటితో సరిపెడుతోంది..!

చైల్డ్ ఆర్టిస్ట్ గా చేసిన వారికి పెద్దయ్యాక సినిమా ఆఫర్లు రావడం చాలా అరుదు. చైల్డ్ ఆర్టిస్ట్ గా వాళ్లని చూసిన ఆడియన్స్ పెద్దయ్యాక వారు లీడ్ రోల్స్ చేసినా ఆడియన్స్ ఇంప్రెస్ అవుతారా లేదా అన్నది చెప్పడం కష్టం. అలా చైల్డ్ ఆర్టిస్ట్ గా చేసి సక్సెస్ అయిన తరుణ్ కూడా కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు చేసిన సినిమాల వల్ల ఫేడవుట్ అయిపోయాడు. ఇక చైల్డ్ ఆర్టిస్ట్ గా చేసి హీరోయిన్ గా కూడా చేసిన భామలు ఉన్నారు. వారిలో ఎవరు టాప్ రేంజ్ కి వెళ్లింది లేదు. ఈ క్రమంలో చైల్డ్ రోల్స్ చేసి మెప్పించిన కావ్య కళ్యాణ్ రామ్ మసూధ తో తిరిగి ఎంట్రీ ఇచ్చి బలగం సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. బలగం హిట్ తర్వాత ఒకటి రెండు సినిమాలు చేసిన కావ్య ఆ తర్వాత ఎందుకో అవకాశాలు అందుకోలేదు. సినిమా ఛాన్స్ లు ఎలా ఉన్నా అమ్మడు ఫోటో షూట్స్ తో మాత్రం కేక పెట్టిస్తుంది. సినిమాల్లో ఛాన్స్ లు రావాలంటే ఫోటో షూట్స్ తప్పనిసరి అనే విషయాన్ని కనిపెట్టిన అమ్మడు రకరకాల ఫోటో షూట్స్ తో రచ్చ రచ్చ చేస్తుంది. ఒక మోస్తారు ఇమేజ్ ఉన్న హీరోయిన్స్ కూడా సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో సూపర్ క్రేజ్ తెచ్చుకుంటారు. అందుకే కావ్య కళ్యాణ్ రామ్ కూడా అదే దారిలో అటు సినిమాల లెక్క ఎలా ఉన్నా సరే ఫోటో షూట్స్ విషయంలో మాత్రం చాలా ఫోకస్డ్ గా ఉంది. కావ్య ఫోటో షూట్స్ లో ఏదో తెలియని మ్యాజిక్ ఉంటుంది. అందుకే అమ్మడు ఎప్పుడు ఫోటో షూట్ చేసినా కూడా అది వైరల్ అవుతుంది. ముఖ్యంగా అమ్మడు శారీతో చేసే ఫోటో షూట్స్ కి ఫాలోవర్స్ పిచ్చెక్కిపోతున్నారు. తెలుగు హీరోయిన్స్ లో తనకంటూ ఒక సెపరేట్ ఐడెంటిటీ రావాలని ట్రై చేస్తున్న అమ్మడు ఫోటో షూట్స్ ని బ్లాక్ బస్టర్ అనిపిస్తుంది. ఐతే ఇలా ఫోటో షూట్స్ తో సరిపెట్టడమేనా సినిమాలు చేసేది ఏమైనా ఉందా అన్న కామెంట్స్ వినిపిస్తున్నా ఎవరు ఏమైనా అనుకోని తను చేసేది చేసుకుంటూ వెళ్తానని అంటుంది అమ్మడు. అంతేకాదు ఖాళీగా ఉన్నాం కదా అని ఎలాంటి సినిమా పడితే అలాంటి సినిమా చేయకుండా కథల విషయంలో ఆచి తూచి అడుగులేస్తుంది కావ్య. అందుకే వరుస సినిమాలు చేయట్లేదని తెలుస్తుంది. మరి కావ్య కళ్యాణ్ రాం నెక్స్ట్ సినిమా ఏది అవుతుంది. ఫోటో షూట్స్ లో కాకుండా ఆమెను తెర మీద ఎప్పుడు చూస్తామంటూ ఆడియన్స్ ఆసక్తి చూపిస్తున్నారు.



**కోర్టు నటి తన ఇన్‌స్టా టు సినిమా గ్లో-అప్‌తో అందరినీ ఆకట్టుకుంటుంది**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com